జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు టీఎన్జీవో నాయకుల వినతిపత్రం



జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్

మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

శనివారం 21 నవంబర్ 2026 పేజీలు : 8



ఆదిలాబాద్ లో పేలిన టపాసుల అక్రమాలు

- అదిలాబాద్‌లో విచ్చలవిడిగా అక్రమంగా టపాసుల వి క్రయాలు
- అనుమతులు టపాసుల షాపు
- నిర్వహించేది గోడౌన్ లో దందా
- అక్రమ గోడౌన్ లో పెద్ద ఎత్తు న టపాసుల నిల్వలు
- భయభ్రాంతులకు గరవుతు న్న గ్రామస్తులు
- అధికారుల ఆదేశాలు బేఖా తరు
- మూసివేయాలని అధికారు లు ఆదేశించినా పట్టించు కో ని వ్యాపారి
- బినామీ లైసెన్సులతో మరో 10 షాపులు

ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 19,(ప్రజా జ్యోతి)

ఆదిలాబాద్ లో ఓ టపాసు ల వ్యాపారి అంతా నా యి ష్టం అనే రీతిలో వ్యవహరి స్తున్నాడు. ఎవరైనా కొత్తగా ధుఖాణం తెరవాలి అంటే ముందుగా ఆ వ్యాపారి అ నుమతి తీసుకోవాలి. లేదు కాదు అంటే అంతే సంగతి. ఆ ధుఖానం నడపడానికి అ డ్డంకులు వస్తునే ఉంటాయి. అంతేకాదు నీవు లైసెన్సు తీ సుకోలేదా నా దగ్గరికి రా రూ 15 నుంచి 30 వేలు ఇ వ్వు. ఇదిగో నీకు ప్రభుత్వం జారీ చేసిన లైసెన్సు. అంతే కాదు టపాసులు కూడా నా వద్దే తీసుకోవాలి, వేరేచోట తీసుకుంటే నీ లైసెన్సు వెం టనే రద్దు అవుతుంది. అం తే కాదు అధికారులు దాడు లు కూడా చేయవచ్చు. దా నికి ఆశ్చర్యపోవాల్సిన అవ సరం లేదు. ఆదిలాబాద్ జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా అనేక మంది వ్యాపారులు విచ్చలవిడిగా టపాసులను విక్రయిస్తున్నారు. ఎక్కడ ప డితే అక్కడ దుఖానాలు తె రుస్తూ టపాసులు విక్రయి స్తూ లక్షలాది రూపాయల ను సొమ్ము చేసుకుంటున్నా రు. ప్రభుత్వ నిబంధనలు - మిగతా3లో

భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక.. వైభవంగా రూపుదిద్దుకోనున్న

విశ్వేనాథ ఆలయం!



- రూ.10 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం.. తొలి విడతలో రూ.5 కోట్లతో పనులు
- ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ప్రత్యేక చొరవ.. 2028 గోదావరి పుష్కరాల నాటికి శివాలయం పూర్తి చేసేలా చర్యలు
- ఆలయ అభివృద్ధిపై హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు, భక్తులు

3

పుస్తక పఠనంతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చు

ఆసిఫాబాద్, నవంబర్ 21 ప్రజా జ్యోతి పుస్తకం మన వెంట ఉంటే మంచి స్నేహితుడు తోడుగా ఉన్నట్లేనని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్‌తో కలిసి ఆమె హాజరయ్యారు.

8



మున్సిపల్ కార్మికురాలిపై దాడి చేసిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

కార్మికురాలికి న్యాయం చేయాలి..

మంచిర్యాల మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం డిమాండ్





మంచిర్యాల, 20, నవంబర్ (ప్రజాజ్యోతి): మున్సిపల్ విధులు నిర్వహిస్తున్న కార్మికురాలిపై దాడికి పాల్పడిన బాలకృష్ణ అనే వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, బాధితురాలికి న్యాయం చేయాలని మంచిర్యాల జిల్లా మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం మంచిర్యాల టౌన్ ఏసీపీకి సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. నల్లగొండ జిల్లా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 45వ డివిజన్ ఆనంద్‌నగర్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఓ మున్సిపల్ కార్మికురాలిని ఇంటి యజమాని బాలకృష్ణ ఇనుక బస్తా తీసుకెళ్లిందనే కారణంతో దుర్భాషలాడుతూ, కులం పేరుతో అవమానించడమే కాకుండా, లావుపాటి కర్రతో ఆమె కాళ్లపై పలుమార్లు కొట్టి దాడికి పాల్పడినట్లు సంఘం నాయకులు ఆరోపించారు. ప్రజారోగ్యం కోసం పారిశుద్ధ్య సేవలు అందిస్తున్న మున్సిపల్ కార్మికులపై ఇలాంటి దాడులు జరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉన్న కార్మికులపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఏసీపీని కోరారు. బాధితురాలికి తగిన న్యాయం చేయడంతో పాటు, దాడికి పాల్పడిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు సుదమ్మ హరికృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షులు బూడిద శ్యాంకుమార్, అధ్యక్షులు కొయ్యల వెంకటి, ప్రధాన కార్యదర్శి కొక్కిల్ల శ్రీనివాస్ తదితర సంఘం నాయకులు పాల్గొన్నారు.

గూడెం గుట్టపై కార్తీక శోభ





సత్యదేవుని సన్నిధిలో 648 వ్రతాలు

ఏకాదశి వేళ పోటెత్తిన భక్తజనం

దండేపల్లి,నవంబర్ 20(ప్రజాజ్యోతి): కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం గుట్టపై కొలువైన శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. శుక్రవారం ఉదయం నుంచే జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు సుదూర జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మారుమోగింది.

వ్రతాలు, కార్తీక దీపారాధనలు

ఏకాదశిని పురస్కరించుకొని ఆలయంలో 648 మంది దంపతులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించి, దామోదర దీపదానాలు సమర్పించారు.

భక్తులకు విస్తృత ఏర్పాట్లు:

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎస్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో దేవస్థానం అధికారులు ప్రత్యేక



ఏర్పాట్లు చేశారు. దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి వసతి కల్పించారు. వాహనాల రద్దీని నియంత్రిస్తూ, భక్తుల కోసం లడ్డూ, పులిహోర ప్రసాదాలను విక్రయించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులందరికీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు టీఎన్జీవో నాయకుల వినతిపత్రం



మంచిర్యాల, 20, నవంబర్ (ప్రజాజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఐఏఎస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో నాణ్యమైన సరుకుల సరఫరా, ఇతర మౌలిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి గృహాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించి, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మోసిన్, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంచాలి

ప్రస్తుతం ఇస్తున్న మొత్తానికి అదనంగా రూ.45, రూ.50 పెంచాలి

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి.. సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ డిమాండ్



ఆసిఫాబాద్, నవంబర్ 20 ప్రజా జ్యోతి రాష్ట్రవ్యాప్తంగా గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల మెస్ ఛార్జీలను తక్షణమే పెంచాలని సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ పార్టీ జిల్లా కార్యదర్శి గోగార్ల తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రస్తుతం అందిస్తున్న మెస్ ఛార్జీలు సరిపోవడం లేదన్నారు. బియ్యం, పప్పులు, కూరగాయలు, వంట నూనెలు, పాలు, గుడ్లు తదితర సరుకుల ధరలు పెరగడంతో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడం కష్టంగా మారిందన్నారు. పేద, మధ్యతరగతి, గిరిజన కుటుంబాలకు చెందిన విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మెస్ బడ్జెట్‌ను పెంచాలన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు అందిస్తున్న మెస్ ఛార్జీలకు అదనంగా రూ.45, రూ.50 పెంచి, రోజువారీ మొత్తాన్ని రూ.90, రూ.100కు చేర్చాలని కోరారు. పాఠశాలల్లో భోజన నాణ్యత, పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని కోరారు.

భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక.. వైభవంగా రూపుదిద్దుకోనున్న విశ్వనాథ ఆలయం!

రూ.10 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం.. తొలి విడతలో రూ.5 కోట్లతో పనులు

ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ప్రత్యేక చొరవ.. 2028 గోదావరి పుష్కరాల నాటికి శివాలయం పూర్తి చేసేలా చర్యలు

ఆలయ అభివృద్ధిపై హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు, భక్తులు







మంచిర్యాల, నవంబర్ 20 (ప్రజాజ్యోతి):మంచిర్యాల పట్టణం నడిబొడ్డున భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా, ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ విశ్వనాథ ఆలయం నూతన వైభవాన్ని సంతరించుకోనుంది. పట్టణ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చే దిశగా సుమారు రూ.10 కోట్ల వ్యయంతో ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ప్రత్యేక చొరవతో ప్రారంభమైన ఈ పనులు ప్రస్తుతం ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు, వేలాదిగా తరలివచ్చే భక్తులకు మెరుగైన ఆధ్యాత్మిక, మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా నిర్మాణ ప్రణాళిక రూపొందించారు.

పండుగల వేళ భక్తులతో కిటకిట.. పునర్నిర్మాణానికి శ్రీకారం

మంచిర్యాల పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల భక్తులకు శ్రీ విశ్వనాథ ఆలయం ఎంతో ప్రత్యేకమైనది. ప్రతిరోజూ నిత్య పూజలు జరిగే ఈ ఆలయంలో ఉగాది, దసరా, దీపావళి, సంక్రాంతి, హనుమాన్ జయంతి తదితర పర్వదినాల సందర్భంగా భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. ముఖ్యంగా పండుగలు, ప్రత్యేక పూజల సమయంలో వేలాదిమంది భక్తులు ఆలయానికి తరలివస్తుంటారు. అయితే పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఆలయ ప్రాంగణం సరిపోకపోవడం, మరింత విశాలమైన వసతులు అవసరం కావడంతో ఆలయాన్ని పూర్తిస్థాయిలో పునర్నిర్మించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో గత రెండు నెలలుగా పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి ముందుకు సాగిస్తున్నారు.

ఆగమ సంప్రదాయాలతో దేవతామూర్తుల తరలింపు.. కొనసాగుతున్న నిత్య పూజలు

ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ప్రాంగణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, శివాలయం, అమ్మవారి ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయాలతో పాటు కళ్యాణ మంటపం, గోశాలను తొలగించే ప్రక్రియను భక్తి శ్రద్ధలతో నిర్వహించి తొలగించారు . దేవతామూర్తులను తరలించే ముందు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి సంప్రదాయబద్ధంగా విగ్రహాలను మరోచోట భద్రపరిచారు. ఆలయ నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ భక్తుల ఆధ్యాత్మిక భావాలకు ఇబ్బంది కలగకుండా నిత్య పూజా కార్యక్రమాలను భక్తిపూర్వకంగా కొనసాగిస్తున్నారు. నిర్మాణ సమయంలోనూ భక్తులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

అద్భుతంగా ఆలయ నమూనా.. అన్ని సౌకర్యాలతో నూతన రూపం

పునర్నిర్మాణం అనంతరం విశ్వనాథ ఆలయం మరింత ఆకర్షణీయంగా, ఆధ్యాత్మిక శోభతో దర్శనమివ్వనుంది. రూపొందించిన ఆలయ నమూనాలు భక్తులను ఆకట్టుకునేలా ఉన్నాయి. సంప్రదాయ దేవాలయ నిర్మాణ శైలికి ప్రాధాన్యతనిస్తూ, ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తుల రాకపోకలకు, దర్శనాలకు అనుకూలంగా నిర్మాణాలు చేపట్టనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులు కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ ఆలయ పునర్నిర్మాణం పూర్తయితే మంచిర్యాల పట్టణ ఆధ్యాత్మిక ప్రాధాన్యం మరింత పెరగనుంది.

రూ.10 కోట్లతో అభివృద్ధి.. తొలి విడతలో రూ.5 కోట్ల కేటాయింపు

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ప్రత్యేక చొరవతో సుమారు రూ.10 కోట్ల వ్యయంతో ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మొదటి విడతలో రూ.5 కోట్లతో నూతన ఆలయ నిర్మాణ పనులు చేపడుతున్నారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత ప్రణాళిక ప్రకారం సాగాలని ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఇందులో భాగంగా ఆయన స్వయంగా ఆలయానికి చేరుకుని నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంచిర్యాల ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన విశ్వనాథ ఆలయాన్ని అద్భుతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పనులను పర్యవేక్షిస్తున్నారు.

జూన్, 2028 గోదావరి పుష్కరాల నాటికి శివాలయం పూర్తి చేయడమే లక్ష్యం

జూన్,2028లో జరగనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని మంచిర్యాల విశ్వనాథ ఆలయంతో పాటు గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయాల అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అవసరమైన ఏర్పాట్లు ఇప్పటి నుంచే చేపడుతున్నారు. విశ్వనాథ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ముందుగా శివాలయ నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పుష్కరాల సమయానికి భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అభివృద్ధి, సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అలాగే పట్టణంలోని కాలేజీ రోడ్డులో ఉన్న గోదావరి పుష్కర ఘాట్ అభివృద్ధి పనులను కూడా అధికారులు పరిశీలించారు.

ఎమ్మెల్యే చొరవపై భక్తుల హర్షం.. కృతజ్ఞతలు

మంచిర్యాల పట్టణ ప్రజల చిరకాల ఆకాంక్షను గుర్తించి, ప్రసిద్ధ శ్రీ విశ్వనాథ ఆలయ పునర్నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపుతున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు పట్టణ ప్రజలతో పాటు ఆలయ భక్తులు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. తరతరాలుగా భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి కేంద్రంగా ఉన్న ఆలయాన్ని మరింత విశాలంగా, సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు భవిష్యత్తులో వచ్చే వేలాది మంది భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా 2028 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వడం, ముందుగా శివాలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగడం పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా త్వరితగతిన పూర్తయి భక్తులకు అందుబాటులోకి రావాలని పట్టణ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ఇటీవల దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాస్, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ తదితరులు ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించి విశ్వనాథ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ముక్త రవి, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, మంచిర్యాల ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ గుండ సుధాకర్, సంబంధిత అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. మొత్తంగా.. మంచిర్యాల పట్టణానికి ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచిన శ్రీ విశ్వనాథ ఆలయం పునర్నిర్మాణంతో సరికొత్త రూపును సంతరించుకోనుంది. భక్తుల విశ్వాసాలు, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ఆధునిక సౌకర్యాలతో ఆలయాన్ని అభివృద్ధి చేయడం పట్టణ ప్రజల్లో ఆనందాన్ని కలిగిస్తోంది. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తీసుకుంటున్న ప్రత్యేక చొరవతో ఈ ఆలయ పునర్నిర్మాణం సాకారమవుతుండటంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనులు పూర్తయితే శ్రీ విశ్వనాథ ఆలయం మంచిర్యాల ఆధ్యాత్మిక చరిత్రలో మరో ప్రత్యేక అధ్యాయంగా నిలవనుంది.

రూ.60 వేల కోట్లకు చేరిన సింగరేణి బకాయిలు

ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆర్థిక సంక్షోభంలోకి బొగ్గు సంస్థ.. కార్మికుల భవిష్యత్తుపై ఆందోళన

బకాయిల వసూలు కోసం రాష్ట్ర ప్రభుత్వంపై దశలవారీ ఉద్యమం చేపడతాం

ఏబీకేఎంఎస్--బీఎంఎస్ కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్





మంచిర్యాల, 20, నవంబర్ (ప్రజాజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలు సుమారు రూ.60 వేల కోట్లకు చేరుకోవడం ఆందోళన కలిగిస్తోందని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఏబీకేఎంఎస్--బీఎంఎస్) కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్ తెలిపారు . వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోతున్నప్పటికీ ప్రభుత్వం చెల్లింపులపై తగిన చొరవ చూపకపోవడంతో సంస్థ తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించకుండా సంస్థపై మరింత ఆర్థిక భారం మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఏబీకేఎంఎస్--బీఎంఎస్) ముఖ్య కార్యకర్తల సమావేశానికి డిప్యూటీ జనరల్ సెక్రటరీ జీవీ కృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా బొగ్గుకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సంస్థలు ముందస్తు చెల్లింపులు చేసి బొగ్గు కొనుగోలు చేస్తున్నాయని తెలిపారు. అయితే తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థలు మాత్రం సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలను పెండింగ్‌లో ఉంచడం విచారకరమన్నారు. సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో సగానికి పైగా రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థలకు సరఫరా అవుతున్నప్పటికీ, వాటికి సంబంధించిన బకాయిలు సకాలంలో చెల్లించడం లేదని విమర్శించారు. దీంతో కార్మికులకు నెలనెలా వేతనాలు చెల్లించేందుకు సైతం సంస్థ బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఇది ప్రతిష్టాత్మక ప్రభుత్వ రంగ సంస్థ ఆర్థిక స్వావలంబనను దెబ్బతీస్తోందని అన్నారు . ఒకవైపు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యంతో తరచూ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ సంస్థ కార్యకలాపాలపై సూచనలు చేస్తున్నారని, మరోవైపు కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధులు నియోజకవర్గాల అభివృద్ధి కోసం సింగరేణి నిధులు కేటాయించాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. అయితే సంస్థకు రావాల్సిన వేల కోట్ల రూపాయల బకాయిల వసూలుపై మాత్రం ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపకపోవడం శోచనీయమన్నారు. సింగరేణి సంస్థను కేవలం ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మాత్రమే చూడకుండా, వేలాది మంది కార్మికుల జీవనాధారంగా, లక్షలాది కుటుంబాల భవిష్యత్తుకు భరోసాగా గుర్తించి దాని ఆర్థిక పరిరక్షణకు ప్రభుత్వం బాధ్యత వహించాలని కోరారు. సింగరేణి నుంచి నిధులు కోరుతున్న ప్రజాప్రతినిధులు ముందుగా సంస్థకు రావాల్సిన బకాయిల చెల్లింపుపై ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. బకాయిలు పేరుకుపోతున్నా ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో సంస్థ కార్యకలాపాలతో పాటు కార్మికుల వేతనాలు, సంక్షేమ పథకాలు, ఉద్యోగుల ప్రయోజనాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిని అప్పుల ఊబిలోకి నెట్టి కార్మికుల భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించకపోతే ఏబీకేఎంఎస్ ఆధ్వర్యంలో దశలవారీగా పెద్ద ఎత్తున ఉద్యమాలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టి.ఎస్. పవన్ కుమార్, బి. రాంసింగ్, మొగిలిపాక రవి, కాసర్ల మోహన్, కోదండరాం, సంగం చందర్, శైలేష్, బి. భీమ, రాజేష్, బి. నరేష్, శ్రవణ్ కుమార్, భూపతి రాజు, వీర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, రిజర్వేషన్లు అమలు చేయాలని విజ్ఞప్తి

పార్లమెంటరీ కమిటీకి 14 ప్రధాన డిమాండ్లతో వినతిపత్రం

మంచిర్యాల, 20, నవంబర్ (ప్రజాజ్యోతి): సింగరేణి కాలరీస్ సంస్థలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సింగరేణి ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ తాజ్ కృష్ణ హోటల్‌లో జరిగిన ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై పార్లమెంటరీ కమిటీ సమీక్షా సమావేశంలో సంఘం అధ్యక్షుడు, డిప్యూటీ జనరల్ మేనేజర్ గోళ్ల రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా కృష్ణమూర్తి పాల్గొని 14 ప్రధాన అంశాలతో కూడిన వినతిపత్రాన్ని కమిటీకి సమర్పించారు. ఈ సందర్భంగా సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రాజ్యాంగబద్ధమైన హక్కులు, రిజర్వేషన్లు, పదోన్నతులు, ఉద్యోగ భద్రత, సంక్షేమానికి సంబంధించిన పలు సమస్యలను కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. డిమాండ్ల వివరాల ప్రకారం ..సీనియర్ ఎస్టీ అధికారులకు కీలకమైన పోస్టింగులు కల్పించాలని, అర్హత ఉన్నప్పటికీ అన్యాయానికి గురైన అధికారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ. భీభత్సకు కార్పొరేట్ కార్యాలయంలో జీఎం (ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) పోస్టింగ్ ఇవ్వాలని, డీజీఎం కె. మధుబాబును కుటుంబ, వైద్యపరమైన కారణాల దృష్ట్యా తిరిగి హైదరాబాద్‌కు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ అధికారి గుర్రాల ఆనందరావుకు విధించిన నిర్బంధ పదవీ విరమణ శిక్షను పునఃసమీక్షించాలని, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ విభాగంలోని అర్హులైన ఎస్టీ అధికారులకు నోషనల్ రీగ్రేడేషన్, వేతన స్థిరీకరణతో పాటు సంబంధిత ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని కోరారు. రిజర్వేషన్ రోస్టర్ల తనిఖీలో రెండు ఎస్టీ ఉద్యోగ సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని, ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, లైజన్ అధికారుల నియామకాల్లో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు గనుల్లో పనిచేస్తున్న ఎస్టీ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని పేర్కొన్నారు. భార్యాభర్తలు ఒకే చోట పనిచేసేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సింగరేణిలో కూడా అమలు చేయాలన్నారు .డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీలలో నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ అధికారులకు ప్రాతినిధ్యం కల్పించాలని, యాక్టింగ్ ప్రమోషన్ ప్యానళ్లలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వాహనాల అద్దె, ఇతర ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టుల్లో ఎస్టీలకు కనీసం 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ప్రతి ఏరియాలో ఎస్సీ, ఎస్టీ నిర్వాసితుల సహకార సంఘాలకు కనీసం రెండు కాంట్రాక్టులు ఇవ్వాలనే నిబంధనను అమలు చేయాలని కోరారు. సింగరేణి నివాస గృహాల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రిజర్వేషన్లు అమలు చేయాలని, యాజమాన్యం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాలతో ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షా సమావేశాలు నిర్వహించాలని, సంఘాల ప్రతినిధులకు రిజర్వేషన్ విధానాలపై ప్రత్యేక శిక్షణ కల్పించాలని కోరారు. సింగరేణిలో రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం పూర్తిస్థాయిలో అమలయ్యేలా పార్లమెంటరీ కమిటీ జోక్యం చేసుకొని యాజమాన్యానికి తగిన ఆదేశాలు, సిఫార్సులు చేయాలని సంఘం అధ్యక్షుడు గోళ్ల రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం తరఫున రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా కృష్ణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ బానోత్ సాయి పవన్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వాంకుడోతు శివ, డిప్యూటీ జనరల్ సెక్రటరీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల సమస్యలు పరిష్కరించాలి

డీఎంఈని కలిసేందుకు అనుమతి ఇవ్వకపోవడంతో ప్రజాసంఘాల ఆగ్రహం

మీటింగ్ హాల్ తలుపుకు వినతిపత్రం అంటించి నిరసన

ఆసిఫాబాద్,నవంబర్ 20 ప్రజా జ్యోతి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గత ఐదు రోజులుగా విద్యార్థులు చేపడుతున్న ఆందోళనలపై విచారణ జరిపేందుకు హైదరాబాద్ నుంచి వచ్చిన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)ను కలిసి విద్యార్థుల సమస్యలపై వినతిపత్రం అందజేసేందుకు ప్రజాసంఘాల నాయకులు ప్రయత్నించారు. అయితే డీఎంఈని కలిసేందుకు సమయం కేటాయించకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో డీఎంఈ సమావేశం నిర్వహిస్తున్న మీటింగ్ హాల్ తలుపుకు వినతిపత్రాన్ని అంటించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మారుమూల జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరైనా, సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. కళాశాలలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్య అందడం లేదని పేర్కొన్నారు. మెడికల్ కళాశాల హాస్టల్ నిర్మాణం నత్తనడకన సాగుతుండటంతో విద్యార్థులు అద్దె గదుల్లో ఇబ్బందులు పడుతూ చదువుకోవాల్సి



వస్తోందన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతోపాటు హాస్టల్ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డీఎంఈని కోరారు.ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు కోరంగి మాలశ్రీ, జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గోడిసెల కార్తీక్, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పద్మ, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం నిఖిల్, కేవీపీఎస్ నాయకుడు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

జన్నారం,నవంబర్20(ప్రజాజ్యోతి) జన్నారం మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి సభ్యుడైన సంకరి రాజన్న భార్య లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా, విషయం తెలుసుకున్న తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాంపూర్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున ఆ కుటుంబానికి రూపాయలు 14000 ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ఆపదలో ఉన్న గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని టీ.జీ.డబ్ల్యూ.డబ్ల్యూ సి వ్యవస్థాపకుడు కల్లెడ భూమయ్య తెలిపారు. తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ



ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే హామీని నెరవేర్చి గల్ఫ్ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు లింగాల వెంకటేష్, రాష్ట్ర కన్వీనర్ సంద సుదర్శన్, కమిటీ సభ్యులు కల్లెడ లచ్చయ్య, వెంకటేష్, లచ్చన్న, సత్తయ్య, గ్రామ పెద్దలు శ్రీనివాస్ ,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

దళితుడిపై దాడి చేసిన నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలి

సాలెగూడులో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుల విచారణ

మురికి కాల్వ నిర్మాణంలో అవకతవకలను ప్రశ్నించినందుకే దాడి: నాయకుల ఆరోపణ

ఆసిఫాబాద్, నవంబర్ 20 ప్రజా జ్యోతి ఆసిఫాబాద్ మండలం సాలెగూడులో దళితుడు చాపిడి సురేష్‌పై దాడికి పాల్పడిన బామ్మే రాజారాంను వెంటనే అరెస్టు చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామాన్ని సందర్శించి ఘటనపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు మాట్లాడుతూ.. గ్రామంలో నిర్మించిన మురికి కాల్వ పనుల్లో జరిగిన అవకతవకలను ప్రశ్నించినందుకే సురేష్‌పై దాడి చేయడం సమంజసం కాదన్నారు. ఈ ఘటన వెనుక సర్పంచ్ పాత్ర ఉన్నట్లు తమ విచారణలో వెల్లడైందని ఆరోపించారు. ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అశోక్ మహుల్కర్, ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడు దుర్గం శ్యాంరావు మాట్లాడుతూ.. గ్రామంలో గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు



మురికి కాల్వపై స్లాబ్ వేయకపోవడంతో సురేష్ తల్లి, కోడలు రెండు, మూడు సార్లు కాల్వలో పడినట్లు తెలిపారు. ఈ విషయమై డీఎస్పీ అశోక్, సీఐ రవితో మాట్లాడినట్లు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుర్గం సుఖదేవ్, చాపిడి చూనార్కర్ కారు, చరణ్, చాపిడి విఠల్, బయాబాయి, యురాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు సమిష్టి కృషి అవసరం



రామకృష్ణాపూర్, నవంబర్ 20 (ప్రజా జ్యోతి): బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వ శాఖలు, పోలీస్ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని ప్రజా జాగృతి సమితి రాష్ట్ర అధ్యక్షులు అడ్వకేట్ రాజలింగు మోతె కోరారు.అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలలపై వేధింపులను అరికట్టాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో బాలల హక్కులు, వ్యక్తిగత భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతూ సీఐకి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. బాలలకు భద్రమైన భవిష్యత్తు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

ఆర్టీఐపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి!

ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరగాలి

గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలి: వంగరి ప్రవీణ్



ఆసిఫాబాద్ నవంబర్ 20 ప్రజా జ్యోతి సమాచార హక్కు చట్టం--2005పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రభుత్వాలు, అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సమాచార హక్కు రక్షణ చట్టం--2005 సొసైటీ కొమురం భీం జిల్లా అధ్యక్షుడు వంగరి ప్రవీణ్ కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతోపాటు ప్రజలకు ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 5(1), 5(2) ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు, అప్పీలేట్ అధికారుల వివరాలతో కూడిన సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలు తమ విధులు, అధికారాలు, సిబ్బంది వివరాలు సహా 17 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని స్వచ్ఛందంగా ప్రకటించాలని పేర్కొన్నారు. సెక్షన్ 4(4) ప్రకారం స్థానిక భాషలో సులభంగా అర్థమయ్యేలా సమాచారం అందించాలని, సెక్షన్ 26 ప్రకారం ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించి ఆర్టీఐ దరఖాస్తు, అప్పీల్ ప్రక్రియపై వివరించాలని సూచించారు. ప్రతి పౌరుడు సమాచార హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

కోలం గూడను సందర్శించిన ఐటీడీఏ పీవో





జన్నారం,నవంబర్20(ప్రజాజ్యోతి) బలహీనమైన గిరిజన తెగల(పివిటిజిఎస్) అవగాహన మరియు అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోజున జన్నారం మండలం కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కోలం గూడ గిరిజన గ్రామాన్ని ఉట్నూర్ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందం వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు.గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గిరిజన ప్రజల జీవన విధానము నివాస పరిస్థితులు ప్రాథమిక అవసరాలు మరియు జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నారు.వారి సామాజిక ,ఆర్థిక అభివృద్ధికి అవసరమైన సంక్షేమ చర్యలు, విద్య, వైద్యం, ఉపాధి మరియు ఇతర మౌలిక సదుపాయాలు కల్పనపై సమీక్షించారు. ఈ సందర్భంగా కొత్తపేట సర్పంచ్ దినేష్ పవార్ నాయక్ రాయికుంట, బక్కుగూడ గ్రామాలకు రెండు బ్రిడ్జిలు, 82 కోలామ్ కుటుంబాలకు ఎడ్ల జతలు, అంత్యోదయ కార్డులు అలాగే రేషన్ బియ్యం కొరకు ఇంధన్ పల్లి గ్రామానికి వెళ్లి తీసుకురావడానికి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని కావున కొత్తపేటలోనే రేషన్ షాప్ ఏర్పాటు చేయవలసిందిగా ఐటీడీఏ పీవో మంద మకరందం ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బక్కయ్య,గీర్దావర్ వెంకటేశం, సర్పంచ్ దినేష్ పవార్ నాయక్, పంచాయతీ కార్యదర్శి భీమ్ రావు, ఉపాధి హామీ, మిషన్ భగీరథ సిబ్బంది, గ్రామ పటేల్ కొడప ముత్తు,కోవా సోనేరావు ,ఆనందరావు, గోపి ,జయవంతరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు

వ్యాసరచన, క్విజ్ పోటీలలో సత్తా చాటిన జన్నారం విద్యార్థులు



జన్నారం,నవంబర్20(ప్రజాజ్యోతి) భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్స్ ద్వారా నిర్మల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన క్విజ్ పోటీల్లో మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటి ప్రథమ బహుమతులు సాధించారు. ఓటరు జాబితా ప్రాముఖ్యత, ఎన్నికల విధులు, ఓటు వినియోగం ,ఓట్ల లెక్కింపు ప్రక్రియ అనే అంశాలపై వ్యాసరచన మరియు క్విజ్ పోటీలు నిర్వహించగా వ్యాసరచన విభాగంలో కిష్టాపూర్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న మోక్ష శ్రీ,క్విజ్ విభాగంలో 9వ తరగతి చదువుతున్న ముత్యం అహన్విత వర్మ లు ప్రథమ స్థానాలు సాధించగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఆకుల స్పందన వ్యాసరచన పోటీలో ప్రథమ స్థానం, సేపూరి అలేఖ్య క్విజ్ పోటీలో ప్రథమ స్థానం సాధించారు.నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఐడిఓసి లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, వెంకట మాధవరావు, డిఆర్ఓ రమేష్ రాథోడ్ వీరికి మేమంటూ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

మృతుడు నవీన్ కుటుంబాన్ని పరామర్శించిన జాన్సన్ నాయక్



జన్నారం,నవంబర్20(ప్రజాజ్యోతి)ఇటీవల హైదరాబాద్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జన్నారం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన యువకుడు కుడిది నవీన్ కుటుంబాన్ని శుక్రవారం రోజున బిఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ భూక్య జాన్సన్ నాయక్ మృతుడి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించే కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నవీన్ కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు.ఆయన వెంట పార్టీ అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు గుర్రం రాజారాంరెడ్డి,సులువ జనార్ధన్ ,ఫజల్ ఖాన్, బాణావత్ రాములు నాయక్, ఇప్ప రాకేష్,దేవయ్య,తదితరులు ఉన్నారు

అలరించిన సామాజిక శాస్త్ర మేళ ప్రదర్శన



దండేపల్లి, నవంబర్ 20(ప్రజాజ్యోతి) మండలం వెల్గనూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సామాజిక శాస్త్ర మేళ ఆకట్టుకుంది.. ఈ నెలాఖరులో నిర్వహించనున్న జిల్లాస్థాయిలో ప్రవేశించేందుకుగాను పాఠశాలలో నిర్వహించిన మేళ ఆకట్టుకుంది.. ప్రదర్శనను స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొలిశెట్టి రాజన్న ప్రారంభించారు.. భూతాపం నివారణ, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి, ప్రజాస్వామ్యం పరిరక్షణ, అటవీ సంరక్షణ, ఓటు వినియోగం, బ్యాంకింగ్, విపత్తుల నివారణ తదితర అంశాలపై ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొలిశెట్టి రాజన్న, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రజని, మాధవిలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఇందిరమ్మ జీవిత బీమా తో ప్రతి కుటుంబానికి 5 లక్షల భద్రత

అదనపు కలెక్టర్ చంద్రయ్య





జన్నారం,నవంబర్20 (ప్రజాజ్యోతి)రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హత గల ప్రతి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల భద్రత చేకూరుతుందని, కావున అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ జీవిత బీమా ను సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. జన్నారం మండలం చింతలపల్లి గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ భీమా శిబిరాన్ని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో ఉమర్ షరీఫ్ తో కలిసి సందర్శించి పథకం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కుటుంబానికి 5 లక్షల జీవిత భీమా వర్తిస్తుందని, డేటా ఎంట్రీని పారదర్శకంగా తప్పులు లేకుండా నిర్వహించాలని, అర్హులైన ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకునేలా కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలని అధికారులకు సూచించారు. అర్జీదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు, ఆహార నాణ్యత, విద్యా బోధన తీరును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంజాల సురేష్ గౌడ్,ఉప సర్పంచ్ లావణ్య,కాసెట్టి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

సింగరేణి కాలరీస్ సంస్థ ఎడ్యుకేషన్ సొసైటీ జనరల్ మేనేజర్ రాజేంద్ర ప్రసాద్

విద్యార్థుల తల్లిదండ్రులతో ఎడ్యుకేషన్ సొసైటీ జీఎం ప్రత్యేక సమావేశం







మంచిర్యాల, 20, నవంబర్ (ప్రజాజ్యోతి): సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాసంస్థల అభివృద్ధికి, విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించేందుకు యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని సింగరేణి కాలరీస్ సంస్థ ఎడ్యుకేషన్ సొసైటీ జనరల్ మేనేజర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్ కళాశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి విద్యార్థుల విద్యా ప్రగతి, బోధనా ప్రమాణాలు, కళాశాలలో కల్పిస్తున్న వసతులు, మౌలిక సదుపాయాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా విద్యార్థుల హాజరు శాతం, పరీక్షా ఫలితాలు, విద్యా ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేకంగా సమీక్షించారు. విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు, అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సుమారు 75 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ కళాశాలలో ప్రస్తుతం సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్ విభాగాల్లో విద్యాబోధన కొనసాగుతోంది. ప్రస్తుత పారిశ్రామిక, సాంకేతిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ఆధునిక కోర్సులు, నూతన సాంకేతిక విద్యా విధానాలను ప్రవేశపెట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించనున్నట్లు జీఎం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకొని విలువైన సూచనలు, సలహాలు అందించిన ఎడ్యుకేషన్ సొసైటీ జీఎం రాజేంద్ర ప్రసాద్‌కు కళాశాల ప్రిన్సిపాల్, డిప్యూటీ జనరల్ మేనేజర్ డినీల్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల అభివృద్ధికి యాజమాన్యం అందిస్తున్న సహకారాన్ని అభినందించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

పుస్తక పఠనంతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి


59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య

మంచిర్యాల, 20,నవంబర్ (ప్రజాజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు, పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు గ్రంథాలయాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఆయన రిటైర్డ్ గ్రంథాలయ అధికారి రాజేంద్రప్రసాద్, గ్రంథాలయ కార్యదర్శి వి.అర్జున్‌లతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో విద్యతో పాటు పుస్తక పఠనానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వివిధ అంశాలపై సమగ్ర సమాచారాన్ని అందించే విజ్ఞాన కేంద్రాలుగా గ్రంథాలయాలు నిలుస్తున్నాయన్నారు. విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా మంచి పుస్తకాలను చదువుతూ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా యువత, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు అదనపు కలెక్టర్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్లు ఎస్.మురళి, ఎస్.రామారావు, వి.గోపయ్య, ఎం.రాజు, సిహెచ్.అనిల్, గ్రంథాలయ సహాయకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.





డిగ్రీ పరీక్షల్లో కాపీయింగ్ కలకలం!



నేరడిగొండ, నవంబర్ 20 (ప్రజాజ్యోతి):మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలలో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి మాస్ కాపీయింగ్ వ్యవహారం యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరీక్షల నిర్వహణ పకడ్బందీగా జరగాల్సిన చోట, నిబంధనలకు నీళ్లొదిలి కొందరు అక్రమార్కులు విద్యార్థులకు కాపీయింగ్‌కు సహకరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కళాశాల నిర్వాహకులే ప్రోత్సహిస్తున్నారా..?

పరీక్ష ప్రారంభమైన కొద్దిసేపటికే పరీక్షా కేంద్రాల పరిసరాల్లో సందడి మొదలవుతోంది. మైక్రో జిరాక్స్ కాపీలు, చీటీలు విద్యార్థుల చేతుల్లోకి సులభంగా చేరుతున్నాయి. కట్టుదిట్టమైన తనిఖీలు, నిఘా లోపించడంతో పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి ఆంక్షలు లేకుండా పోయాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అసలు ఈ మైక్రో జిరాక్స్‌లు పరీక్ష కేంద్రాలలోకి ఎలా వస్తున్నాయి? స్థానిక జిరాక్స్ సెంటర్లలో ఇవి ఎలా లభిస్తున్నాయి? అనే అంశాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి.

విద్యా ప్రమాణాలపై తీవ్ర ప్రభావం

కష్టపడి చదివే సాధారణ విద్యార్థులకు ఇలాంటి అక్రమాల వల్ల అన్యాయం జరుగుతోందని తల్లిదండ్రులు, విద్యావేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన పర్యవేక్షణ కొరవడటం వల్ల డిగ్రీ విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని, భవిష్యత్తులో విద్యార్థుల నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన చెందుతున్నారు.

తనిఖీలు చేపట్టేదెన్నడు?

ఇంత బహిరంగంగా అక్రమాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.మాస్ కాపీయింగ్‌పై ఉన్నతాధికారులు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తక్షణమే స్పందించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, రానున్న పరీక్షలైనా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

పుస్తక పఠనంతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చు



పుస్తకం మంచి స్నేహితుడి వంటిది కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్, నవంబర్ 21 ప్రజా జ్యోతి పుస్తకం మన వెంట ఉంటే మంచి స్నేహితుడు తోడుగా ఉన్నట్లేనని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్దే అనిల్‌తో కలిసి ఆమె హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విజ్ఞానంతో పాటు ఆలోచనా పరిజ్ఞానం పెంపొందుతుందని, జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన స్ఫూర్తి లభిస్తుందని తెలిపారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు, నిరుద్యోగులు, అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. గ్రంథాలయాలను కేవలం పుస్తక పఠన కేంద్రాలుగానే కాకుండా విజ్ఞానాన్ని పంచే స్ఫూర్తి కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.నిరుద్యోగ యువత గ్రంథాలయాల్లోని పుస్తకాలు, పోటీ పరీక్షల అధ్యయన సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో నిరంతరం అధ్యయనం చేసి పోటీ పరీక్షల్లో విజయం సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ, నాయకులు అరిగెల నాగేశ్వరరావు, విశ్వప్రసాద్ రావు, కౌన్సిలర్లు బాలేష్ గౌడ్, జావిద్, భాగ్యలక్ష్మి, శారద, జ్యోతి గ్రంథాలయ కార్యదర్శి, సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

బాసర లో ఇందిరమ్మ జీవిత భీమా కార్యక్రమం ఘనంగా ప్రారంభం



బాసర నవంబర్ 20 (ప్రజా జ్యోతి) నిర్మల్ జిల్లా బాసర గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా కార్యక్రమాన్ని అధికారులు ఘనంగా ప్రారంభించారు. ప్రతి కుటుంబానికి రూ.5లక్షల జీవిత భీమా భరోసా కల్పించడమే ఈ పథకం ముఖ్య లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఓ సదానంద చారి, బాసర మండల స్పెషల్ ఆఫీసర్ రమణ, బాసర కార్యదర్శి ప్రసాద్ గౌడ్ ఉప సర్పంచ్ సయ్యద్ అలి పాల్గొన్నారు. ఐకేపీ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భీమా ప్రయోజనాలు, నమోదు విధానం, అవసరమైన పత్రాల గురించి అధికారులు వివరంగా వివరించారు. కుటుంబానికి అండగా నిలిచే ఈ పథకంలో అర్హులందరూ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అధికారులు కోరారు. గ్రామంలోని ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. ఈ పథకం ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత లభిస్తుందని, కష్టకాలంలో అండగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సోనాలలో 'ఇందిరమ్మ బీమా' పథకం అమలుకు శ్రీకారం



సోనాల, నవంబర్ 20 (ప్రజా జ్యోతి):నిరుపేద మరియు అసంఘటిత రంగ కార్మిక కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ బీమా' పథకం సోనాల మండల కేంద్రంలో అమల్లోకి వచ్చింది. శుక్రవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి మరియు మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో ఈ పథకం అమలుపై ప్రత్యేక అవగాహన మరియు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థికంగా చితికిపోయే పేద కుటుంబాలకు ఈ బీమా పథకం ఎంతో అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారుల వివరాలను పారదర్శకంగా సేకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీసిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

అంతా నా ఇష్టం.....

ఆదిలాబాద్‌లో పేలిన టపాసుల అక్రమాలు

-మొదటిపేజీ తరువాయి

తుంగలో తొక్కి అధికారుల ఆదేశాలను కూడా ఖాతరు చేయకుండా విచ్చలవిడిగా నిభందనలకు విరుద్ధం గా ఠ పాసులు విక్రయిస్తున్నారు. మారుమూల గ్రామీణ ప్రాం తాలతో పాటుగా మండల కేంద్రాలలో కూడా విచ్చల వి డిగా జనసంచారం అదికం గా ఉండే ప్రాంతాలలో ఈ ఠపాసులు విక్రయిస్తున్నా రు. ఈ ఠపాసులు విక్రయిం చడానికీ ముందుగా స్థానిక గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు తీసు కోవా ల్సి ఉంటుంది. ఆ తర్వాత స్తానిక తహసీల్దార్, పోలీస్ స్టేషన్, అగ్నిమాపక అధికా రి అనుమతుల తీసు కోవా ల్సి ఉంటుంది. దీనికి ముం దుగా తాత్కాలిక లైసెన్స్ కో సం ముందుగా గ్రామం బ యట స్థలం, జనసంచారం లేని ప్రాంతంలో ఒకే చోట దుకాణాలు ఏర్పాటు చే సు కోవడం కోసం ప్రత్యేక స్థలం కేటాయించాలి. ఆ స్థలం యజమానితో ఒప్పంద ప త్రంతోపాటు స్థానిక తహసి ల్దార్ దానిని నిర్ధారణ చేసి అనుమతి ఇవ్వాల్సి ఉం టుంది. ఆ తర్వాతనే మిగి తా తహసిల్దార్, గ్రామ పం చాయతీ కార్యదర్శి, అగ్ని మాపక అధికారి ద్వారా నో అబ్జెక్షన్ పత్రాలు జారీ చే యాల్సి ఉంటుంది. అంతే కాదు టపాసులు విక్రయించే సమయంలో ఫైర్ సేఫ్టీ నిబం ధనలు పాటిస్తూ అగ్నిమాప క రక్షణ పరికరాలు ఏర్పా టు చేయాల్సి ఉంటుంది. రె గ్యులర్ గా టపాసులు విక్ర యించేవారు జిల్లా కలెక్టర్ తో పాటు ఆర్డీవో జిల్లా అగ్ని మాపక అధికారి అనుమతు లు కూడా తీసుకోవాల్సి ఉం టుంది. టపాసుల దుకాణా లు జనసంచారం లేని ప్రాం తాల్లో తెరవాలి. ఊరు బ యట ఒక కిలోమీటర్ దూ రంలో ఈ టపాసుల దుకా ణాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. టపాసులు నిల్వ చేసుకోవడానికి ప్రత్యేక గో దాములు కూడా గ్రామము బయట ఒక కిలోమీటర్ దూ రంలో నిర్మించుకోవాల్సి ఉం టుంది. దుకాణాల కొరకు ఫైర్ సేఫ్టీ నిబంధనలు తప్ప నిసరిగా పాటించాల్సి ఉం టుంది. ఇవేమీ పట్టనట్లుగా విచ్చలవిడిగా ఎలాంటి అ నుమతులు లేకుండా అక్ర మంగా వ్యాపారులు దుకా ణాలను తెరుస్తూ టపాసు లను బహిరంగంగా విక్రయి స్తున్నారు. జన సంచార ప్రాంతాలలో దుకాణాలు తెరుస్తూ గోదాములు ఏ ర్పాటు చేసుకుంటూ టపా సులను విక్రయిస్తున్నారు.

బినామీ లైసెన్సులతో వ్యపా రం

అదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఓ వ్యాపారి అధికారుల నుం డి బినామీ పేరుల తో లైసె న్సులు పొంది అక్రమంగా ఈ టపాసుల వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ టపాసుల వ్యాపారానికి ఒకే



ఒక వ్యక్తి ప్రతి సంవత్సరం చక్రం తిప్పుతున్నట్లు తెలు స్తోంది. అధికారులందరి క ట్టుకొని తన వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కా యలుగా సాగిస్తున్నట్లు స మాచారం. పౌస్ గూడ గ్రా మానికి చెందిన అరుణ్ రెడ్డి అనే టపాసుల వ్యాపారి అందరినీ తన గ్రిప్ లో ఉం చుకొని వ్యాపారాన్ని కొన సాగిస్తున్నట్లు తెలుస్తోంది. లైసెన్సులు పొంది వ్యాపా రం చేయని వారి లైసెన్సు లను తన వద్ద ఉంచుకుని బినామీలతో ఆ వ్యాపారం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకే వ్యాపారి దాదాపు పది దుకాణాల వరకు తెరిచి ప్ర తి సంవత్సరం వ్యాపారం చే స్తున్నట్లు సమాచారం. బోర జ్ మండలం పౌస్ పూర్ గ్రామం వద్ద తన వ్యవ సా య క్షేత్రంలో వ్యవసాయ సామాగ్రిలు, యూరియా, ఇతర ఎరువులు నిల్వ చేసు కోవడానికి నిర్మించిన గోడౌన్ లో అక్రమంగా టపాసులు సైతం పెద్ద ఎత్తున నిలువ చేసుకొని ప్రతి సంవత్సరం దీపావళి ప్రారంభమైందంటే తన వ్యాపారాన్ని పెద్ద ఎత్తు న ఇక్కడి నుంచే సాగిస్తు న్నారని గ్రామస్తులు తెలిపా రు. గ్రామంలో ఈ గోడ ఉం డడం వల్ల పెద్ద ప్రమాదం సంభవించవచ్చని గ్రామస్తు లు తీవ్ర భయాందోళనకు గు రవుతున్నారు. జిల్లా అగ్ని మాపక అధికారి సురేష్ కు ఫిర్యాదు చేశారు. ఆ ఈ ఫి ర్యాదు మేరకు జిల్లా అగ్ని మాపక అధికారి ఆ గోడౌన్ తీసివేయాలని ఆ వ్యాపారి కి ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ ఆ వ్యాపారి అవేమీ పట్టనట్లుగా అదే గో దాములో పెద్ద ఎత్తున ట పాసులను నిల్వ చేసి వ్యా పారం కొనసాగిస్తున్నారు. ట పాసుల వ్యాపారంలో ఆరి తేరిన ఎల్ టి అరుణ్ రెడ్డి తనదైన రీతిలో టపాసుల వ్యాపారంలో చక్రం తిప్పు తున్నారు. ఎవరైనా కొత్తగా దుకాణం ఏర్పాటు చేయాల ని నిశ్చయించుకొని అరుణ్ రెడ్డిని సంప్రదించినట్లయితే అధికారుల ప్రమేయం ఏ మాత్రం లేకుండానే ఆయన వద్ద ఉన్న బినామి లైసెన్సు లు ఇచ్చి ఆ వ్యాపారాన్ని ప్రారంభింపజేస్తారు. దీనికి ముందు ఆ టపాసులు తన వద్ద కొనుగోలు చేయాలని లేనట్లయితే లైసెన్సులు లా క్కుంటానని హుకుం జారీ చే స్తారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈ అరుణ్ రెడ్డి దాదాపు 10 బినామీ లైసె న్సులతో దుకాణాలు నడు





పుతున్నట్లు సమాచారం.

అనుమతులు లేని టపాసులు ఎక్కువ

ప్రభుత్వ నుంచి అనుమతి లేని టపాసులను ఎక్కువ గా విక్రయిస్తున్నట్లు తెలు స్తోంది. అక్రమంగా తయారు చేసిన, అనుమతి లేని షా పుల నుంచి దిగుబడి చేసు కొని పెద్ద ఎత్తున ఈ టపా సుల వ్యాపారం కొనసాగి స్తున్నట్లు తెలుస్తోంది. అను మతి ఉన్న కొన్ని టపాసుల ను కొనుగోలు చేసి అందు లో అనుమతి లేని టపాసు లను మిలితం చేసి ఈ వ్యా పారం కొనసాగిస్తున్నారు.

టపాసుల గోడౌన్ కు అ నుమతి లేదు

జిల్లా అగ్నిమాపక అధికారి సురేష్

బోరజ్ మండలం పౌజ్ పూ ర్ గ్రామం వద్ద అక్రమంగా తె రిచిన టపాసుల గోడౌన్ కు ఎలాంటి అనుమతి లేదని, దానిని మూ సివేయాలని నోటీసులు జారీ చేసినప్ప టికీ ఆ వ్యాపారి పెడచెవిన పెడుతున్నారని, జిల్లా అగ్ని మాపక అధికారి సురేష్ స్ప ష్టం చేశారు. ఆ టపాసులు పెద్ద మొత్తంలో నిల్వ చేసిన గోదాంకు ఎలాంటి రక్షణ కూ డా లేదని, తాను పలు మా ర్లు హెచ్చరించానని, త్వర లో ఉన్నతాధి కారుల అను మతితో ఆ గోడౌన్ ను సీజ్ చేస్తామని ఆయన తెలి పా రు. అక్రమంగా తెరిచిన ఆ గోడౌన్ టపాసుల వ్యాపారి పై శాఖ పరమైన చర్యలు కూడా తీసుకుంటామన్నా రు.

ఎర్రవార్ పోశం కుమారుడి వివాహ వేడుకకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు

నూతన వధూవరులను ఆశీర్వదించిన సర్పంచ్, మాజీ ఎంపీపీ

కేరమేరి , నవంబర్ 20 ప్రజా జ్యోతి కెరమెరి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రవార్ పోశం కుమారుడి వివాహ వేడుకలు శుక్రవారం రెబ్బెన మండలం కొండపల్లి గ్రామంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు కెరమెరి సర్పంచ్ పెందోర్ ఆనందరావు, మాజీ ఎంపీపీ అబ్దుల్ కలాం హాజరై నూతన వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరులకు కట్నకానుకలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మెట్టపిఫ్రి సర్పంచ్ కుడ్మేత కొద్దు, బీఆర్ఎస్ నాయకులు కుర్సెంగా దందు, కంబాల వినేష్, రాంచందర్, ముజీబ్, డాక్టర్ రియాన్, ఉత్తమ్, కుటికెల ఆనంద్, శ్రీనివాస్, రాంకిషన్ తదితరులు పాల్గొన్నారు.



ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లతో ఓటు హక్కుపై విస్తృత అవగాహన





జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు

మంచిర్యాల, 20,నవంబర్ (ప్రజాజ్యోతి):ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు విలువను ప్రతి ఒక్కరూ గుర్తించేలా ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన అధికారులతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్ ఓటర్లలో ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించి, ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకైన భాగస్వాములుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచనల మేరకు సంస్థ స్థాయి, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయిలో మూడు దశల్లో పోటీలు నిర్వహించినట్లు వివరించారు. స్వచ్ఛమైన ఓటరు జాబితా ప్రాముఖ్యత, ఓటు హక్కు విలువ వంటి అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా, ఓటరు జాబితా తయారీ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు), ఓటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీప్యాట్), పోలింగ్ ప్రక్రియ, ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.మూడు దశల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిలో ప్రతి విభాగం నుంచి జిల్లా స్థాయిలో ఉత్తమంగా నిలిచిన పది మంది విజేతలను ఎంపిక చేసి, వారికి ధ్రువీకరణ పత్రాలు, మెరిట్ సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. విద్యార్థి దశ నుంచే ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించడం ద్వారా బాధ్యతాయుతమైన ఓటర్లను తయారు చేయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ కో-ఆర్డినేటర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బీమా దరఖాస్తుల స్వీకరణలో నిర్లక్ష్యం వద్దు

ప్రతి కుటుంబానికి పథకం వర్తించేలా చర్యలు చేపట్టాలి

ఆన్‌లైన్ నమోదులో తప్పులు దొర్లకుండా చూడాలి: కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్, నవంబర్ 20 ప్రజా జ్యోతి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌తో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కౌంటర్ ఇన్‌చార్జిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పథకం అమలుపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీమా చేయించుకునే వ్యక్తి వివరాలు, సంతకం, నామినీ వివరాలతో కూడిన దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. దరఖాస్తుకు రేషన్ కార్డు నంబరు ఉంటే సరిపోతుందని తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, దరఖాస్తుదారుల వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. మొబైల్ యాప్ ద్వారా కూడా వివరాలను నమోదు చేయవచ్చని, ప్రక్రియ పూర్తయిన అనంతరం సంబంధిత కుటుంబ సభ్యుల ఫోన్‌కు సందేశం వస్తుందని వివరించారు. కౌంటర్ల ఏర్పాటు వివరాలను టామ్‌టామ్ ద్వారా ప్రజలకు తెలియజేయాలని, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. గోడపత్రాలు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రతిరోజూ నమోదైన దరఖాస్తుల వివరాలతో నివేదిక సమర్పించాలని, ఆన్‌లైన్ నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా అధికారులు గురువయ్య, బిక్షపతి, దత్తారావు, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరికరాల కొనుగోలులో పారదర్శకత పాటించాలి

్రప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అవసరమైన సామగ్రి కొనుగోలుపై అధికారులతో సమీక్ష



మంచిర్యాల, 20,నవంబర్ (ప్రజాజ్యోతి):జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్ నిధుల ద్వారా మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, ఇతర అనుబంధ సామగ్రి కొనుగోలు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు.శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, ఇతర సామగ్రి కొనుగోలుకు సంబంధించి రూపొందించిన ప్రతిపాదనల ను పరిశీలించారు. కొనుగోళ్లకు సంబంధించి ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ ప్రక్రియను నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు.ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ఆసుపత్రి అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన వైద్య పరికరాలు, సామగ్రి కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పర్యవేక్షకులు, సంబంధిత అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా పథకం పోస్టర్లు విడుదల



కోటపల్లి, నవంబర్ 20 (ప్రజాజ్యోతి):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ జీవిత బీమా పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కోటపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోస్టర్లను విడుదల చేశారు.చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు గురువారం కోటపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ జీవిత బీమా పథకం ఉద్దేశాలు, ప్రజలకు కలిగే ప్రయోజనాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు.

శ్రీ పోషమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న పీసీసీ సభ్యులు నూకల రమేష్



చెన్నూరు నియోజకవర్గం, నవంబర్ 20 (ప్రజాజ్యోతి): కోటపల్లి మండలం సిర్సా గ్రామంలో శ్రీ పోషమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చెన్నూరు నియోజకవర్గ పీసీసీ సభ్యులు నూకల రమేష్ హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కోటపల్లి మండల సీనియర్ నాయకులు గంగుల సీతారాం రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో సాగిన ఈ మహోత్సవం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఇందిరాగాంధీ 109వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

చెన్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘన నివాళులు



చెన్నూరు, నవంబర్ 20 (ప్రజాజ్యోతి):భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళగా పేరుగాంచిన దివంగత ఇందిరాగాంధీ 109వ జయంతి వేడుకలను చెన్నూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. చెన్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ తదితరులు పాల్గొని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ అభివృద్ధికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు, పేద ప్రజల సంక్షేమానికి ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం ఆమె తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతాయని పేర్కొన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆమె చేసిన కృషి నేటి తరానికి ఆదర్శమని అన్నారు.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఇందిరాగాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కూలీ పనికి వెళ్తుండగా మృత్యువాత

బైక్ ఢీకొని ఆటో బోల్తా.. ఒకరు మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



చెన్నూరు నియోజకవర్గం, నవంబర్ 20 (ప్రజాజ్యోతి): రోడ్డు ప్రమాదం ఓ కుటుంబంలో విషాదాన్ని నింపింది. కూలీ పనుల నిమిత్తం ఆటోలో వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో ఆడెపు నారాయణ (50) మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయ పడ్డారు. ఈ ఘటన కోటపల్లి మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కోటపల్లి మండలం శంకరాపూర్ గ్రామానికి చెందిన ఆడెపు నారాయణ కూలీ పనులకు వెళ్తుండగా, ఆయన ప్రయాణిస్తున్న ఆటోను బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నారాయణతో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రికి చేరుకునే మార్గమధ్యలోనే నారాయణ మృతి చెందాడు. దీంతో శంకరాపూర్ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.ఈ ప్రమాద ఘటనపై కోటపల్లి ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చెన్నూరులో ఈ నెల 26న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

డాక్టర్ కృష్ణ తేజ



చెన్నూరు, నవంబర్ 20 (ప్రజాజ్యోతి): ప్రజలకు మెరుగైన కంటి ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ నెల 26వ తేదీ గురువారం చెన్నూరులో ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరాన్ని నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నూరు ప్రతినిధులు తెలిపారు.ఈ శిబిరానికి సంబంధించిన వాల్ పోస్టర్లను శుక్రవారం అంగరాజపల్లి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కృష్ణ తేజ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ తేజ మాట్లాడుతూ.. స్థానిక సాయిరాం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు, చికిత్స అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నూరు అధ్యక్షుడు లయన్ నిమ్మల సాగర్, జోన్ చైర్‌పర్సన్ లయన్ జాడి తిరుపతి, లయన్ జక్రుల సత్యనారాయణ, లయన్ ఎస్సం సతీష్, మానసమంద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పిన్నారం పాఠశాలలో మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ప్రారంభం

విద్యార్థులకు అల్పాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం



చెన్నూరు నియోజకవర్గం, నవంబర్ 20 (ప్రజాజ్యోతి): చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు గురువారం పిన్నారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ పోసాని తిరుపతి విద్యార్థులకు అల్పాహారం అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఉదయం పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, విద్యాభ్యాసం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేశం, కోటపల్లి కాంగ్రెస్ పార్టీ ప్రచారకర్త రాజబాపు, వార్డు సభ్యులు రాజబాపు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

జానకాపూర్ 1వ వార్డులో పలు ఇళ్లను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు

అర్హులకు సొంతింటి భాగ్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



ఆసిఫాబాద్, నవంబర్ 20 ప్రజాజ్యోతి పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేద కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపుతోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జానకాపూర్ 1వ వార్డులో నూతనంగా నిర్మించిన పలు ఇందిరమ్మ ఇళ్లను శుక్రవారం గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కామ్డే, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు, కౌన్సిలర్ జాడి వినోద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన గృహాల లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు సొంతింటి భాగ్యం కల్పించేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఇళ్ల ప్రారంభంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్యం

పీఎం రాహత్ పథకంపై ఐటీఐ విద్యార్థులకు అవగాహన సదస్సు

మంచిర్యాల, 20,నవంబర్ (ప్రజాజ్యోతి):రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించడంతో పాటు ప్రాణాలను కాపాడే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రాహత్ పథకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) ఆడిటోరియంలో సేఫ్ జర్నీ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంచిర్యాల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) కోల రవీందర్ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న దేశాల్లో భారత్ ఉండటం ఆందోళనకరమన్నారు. ప్రమాదాల నివారణకు రూపొందించిన ప్రత్యేక పథకాల్లో పీఎం రాహత్ ఒకటని పేర్కొన్నారు. రోడ్లపై నడుస్తూ లేదా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురైన బాధితులు గరిష్ఠంగా ఏడు రోజుల వరకు రూ.1.50 లక్షల విలువైన ఉచిత వైద్య చికిత్స పొందేందుకు అర్హులని వివరించారు. ఈ పథకంపై ఐటీఐ విద్యార్థులు అవగాహన పెంచుకొని ప్రజలకు సమాచారాన్ని చేరవేయాలని కోరారు. మంచిర్యాల ట్రాఫిక్ సీఐ హన్నన్ మాట్లాడుతూ, విద్యార్థులంతా ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ ఆదర్శ పౌరులుగా ఎదగాలని సూచించారు. రహదారి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణాలు చేయాలని సూచించారు. తాను గత 40 సంవత్సరాలుగా రాష్ట్ర రహదారులపై సురక్షితంగా ప్రయాణిస్తున్నానని పేర్కొంటూ, ఐటీఐ సిబ్బంది, విద్యార్థులంతా రహదారులపై బాధ్యతాయుత ప్రవర్తనతో నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. ప్రధాన వక్తగా హాజరైన సేఫ్ జర్నీ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నీలం సంపత్ మాట్లాడుతూ ప్రపంచ వాహనాల సంఖ్యలో కేవలం ఒక శాతం వాహనాలు మాత్రమే కలిగి ఉన్న భారత్, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 12 శాతం వాటాను కలిగి ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రపంచ బ్యాంకు సూచనల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ ప్రమాదాల సంఖ్య తగ్గకపోవడం విచారకరమన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడే వారికి రాహ్‌వీర్ గుర్తింపుతో పాటు రూ.25 వేల నగదు



బహుమతి అందిస్తారని వివరించారు. అలాగే ప్రమాద బాధితులకు పీఎం రాహత్ పథకం ద్వారా రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స అందించే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు.సేఫ్ జర్నీ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ లయన్ చిలువేరు శ్రీనివాస్ స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన ఈ సదస్సు విద్యార్థులకు రహదారి భద్రతపై విలువైన సందేశాన్ని అందించింది.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ హన్నన్, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నీలం సంపత్, జనరల్ సెక్రటరీ చిలువేరు శ్రీనివాస్, ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ సిబ్బంది, ఐటీఐ అధ్యాపకులు, ఇతర సిబ్బంది, సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు మీడియా గొంతుక కావాలి.. సంక్షేమ పథకాలకు వారధి కావాలి!

ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా పాత్ర కీలకం

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా విస్తృత ప్రచారం కల్పించాలి

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా నిర్మల్ ప్రెస్ క్లబ్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి ,నవంబర్ 20 ,(ప్రజాజ్యోతి)సమాజ చైతన్యానికి, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడానికి మీడియా కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.నవంబర్ 16న నిర్వహించిన జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నిర్మల్ పట్టణంలోని ప్రెస్ క్లబ్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో జరిగే పరిణామాలను ప్రజలకు ప్రతిబింబించే నిలువుటద్దం మీడియా అని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పాత్రికేయుల కృషి అభినందనీయమన్నారు. ప్రజా సమస్యలను వెలికితీస్తూ, వాటి పరిష్కారానికి దోహదపడే నిర్మాణాత్మక వార్తలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రస్తుత కృత్రిమ మేధ (ఏఐ) యుగంలో తప్పుడు సమాచారం, అసత్య వార్తలు వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున జర్నలిస్టులు వార్తలను ప్రచురించే ముందు వాస్తవాలను పూర్తిస్థాయిలో నిర్ధారించుకోవాలని అన్నారు. విశ్వసనీయత, నిష్పాక్షికత, బాధ్యతాయుతమైన జర్నలిజం మీడియా రంగానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.జిల్లాలోని వివిధ శాఖలకు సంబంధించిన ప్రజా సమస్యలపై మీడియాలో ప్రచురితమయ్యే వార్తలను ప్రతిరోజూ తాను స్వయంగా పరిశీలిస్తున్నానని తెలిపారు. జిల్లా స్థాయిలో పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించాల్సిన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని వివరించారు. నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. మీడియా రంగంలో మహిళా జర్నలిస్టులను మరింతగా ప్రోత్సహించాలని సూచించారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై విస్తృత అవగాహన కల్పించాలి



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మీడియా ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.రాష్ట్రంలో బీమా రక్షణ లేని కుటుంబం ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ వినూత్న పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. వివిధ బీమా పథకాలను సమన్వయం చేస్తూ ప్రతి అర్హ కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న పెద్ద వ్యక్తి అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే, ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఈ పథకం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో నేటి నుంచి అన్ని గ్రామాల్లో ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహిస్తూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు వివరాల ఆధారంగా అర్హ కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కుటుంబ సభ్యుల్లో ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినీలుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని, నామినీ



మైనర్‌గా ఉన్నట్లయితే వారి తరఫున అపాయింటీ వివరాలను కూడా నమోదు చేస్తామని తెలిపారు. రేషన్ కార్డులు లేని కుటుంబాలకు ఆధార్ కార్డు వివరాల ఆధారంగా నమోదు ప్రక్రియ చేపట్టేందుకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఇంటర్నెట్ సదుపాయం సరిగా లేని ప్రాంతాల్లోనూ నమోదు ప్రక్రియకు ఆటంకం కలగకుండా ప్రత్యేక ఆఫ్‌లైన్ మొబైల్ యాప్‌ను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకం ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా మీడియా ప్రతినిధులు తమ వార్తా మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.అనంతరం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులకు కలెక్టర్ చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేసి శాలువాలతో సత్కరించారు.అనంతరం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించిన గోడప్రతులను జిల్లా కలెక్టర్ సీపీఓ గంగారెడ్డి, అధికారులతో పాటు మీడియా ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఇ. విష్ణువర్ధన్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, ప్రెస్ క్లబ్ సభ్యులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తోందా?

ప్రభుత్వ వాటా విక్రయాలు.. అనుబంధ సంస్థల ఐపీఓలు.. బొగ్గు రంగంలో పెరుగుతున్న ప్రైవేట్ భాగస్వామ్యం!

కోల్ ఇండియా పరిణామాలతో సింగరేణి భవిష్యత్తుపైనా చర్చ.. కార్మికుల ఉద్యోగ భద్రతపై ఆసక్తి



మంచిర్యాల, 20,నవంబర్ (ప్రజాజ్యోతి):దేశ బొగ్గు పరిశ్రమలో కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా లిమిటెడ్ క్రమంగా ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తోందా? ప్రభుత్వ వాటా విక్రయాలు, అనుబంధ సంస్థల స్టాక్ మార్కెట్ లిస్టింగ్, ఆస్తుల నగదీకరణ, వాణిజ్య బొగ్గు తవ్వకాల్లో ప్రైవేట్ కంపెనీలకు పెరుగుతున్న అవకాశాలు ఈ ప్రశ్నకు ప్రాధాన్యతను పెంచుతున్నాయి. కోల్ ఇండియాను పూర్తిగా ప్రైవేటీకరించాలనే అధికారిక నిర్ణయం లేనప్పటికీ, సంస్థ యాజమాన్య నిర్మాణంలో చోటుచేసుకుంటున్న మార్పులు ప్రభుత్వ రంగ బొగ్గు పరిశ్రమ భవిష్యత్తుపై చర్చకు దారితీస్తున్నాయి.

ప్రభుత్వ వాటా 61.13 శాతానికి తగ్గింపు

2026-27 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానం ద్వారా కోల్ ఇండియాలో తనకున్న రెండు శాతం వాటాను విక్రయించింది. దీంతో ప్రభుత్వ వాటా 61.13 శాతానికి తగ్గింది. కేంద్ర ప్రభుత్వమే మెజారిటీ వాటాదారుగా కొనసాగుతున్నప్పటికీ, ప్రభుత్వ వాటా తగ్గుతున్న పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

అనుబంధ సంస్థల ఐపీఓలతో కొత్త మార్పులు

కోల్ ఇండియా పరిధిలోని అనుబంధ సంస్థలను స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ చేయడం మరో కీలక పరిణామం. ఇప్పటికే భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ (బీసీసీఎల్), సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంపీడీఐ) సంస్థలు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదయ్యాయి. మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎంసీఎల్) ఐపీఓ ప్రక్రియ నవంబర్ 2026లో కొనసాగుతోంది.మరోవైపు సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్) ఐపీఓకు సంబంధించి డ్రాఫ్ట్ పత్రాలు దాఖలయ్యాయి. నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎన్‌సీఎల్), సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (సీసీఎల్) సంస్థలను కూడా స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ప్రక్రియ ద్వారా పెట్టుబడిదారుల భాగస్వామ్యం పెరగడంతో పాటు సంస్థల ఆర్థిక విలువకు మార్కెట్‌లో గుర్తింపు లభిస్తుంది.

ప్రైవేట్ పెట్టుబడులకు విస్తరిస్తున్న బొగ్గు రంగం

2020లో ప్రారంభమైన వాణిజ్య బొగ్గు తవ్వకాల విధానం ద్వారా ప్రైవేట్ సంస్థలకు వేలం ప్రక్రియలో గనులను దక్కించుకొని బొగ్గును తవ్వి విక్రయించే అవకాశం కల్పించారు. బొగ్గు ఉత్పత్తి పెంపు, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, పోటీని ప్రోత్సహించడం, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం ఈ విధానం ప్రధాన లక్ష్యాలుగా పేర్కొంటున్నారు. అయితే ఈ పరిణామాలతో ప్రభుత్వ రంగ సంస్థల ఆధిపత్యానికి భవిష్యత్తులో ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయన్నది చర్చనీయాంశంగా మారింది.

ఐపీఓ అంటే ప్రైవేటీకరణేనా?

అనుబంధ సంస్థలను స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ చేయడం, వాటాల్లో కొంత భాగాన్ని ప్రజలకు విక్రయించడం మాత్రమే పూర్తిస్థాయి ప్రైవేటీకరణ కాదు. కోల్ ఇండియా తన అనుబంధ సంస్థల్లో మెజారిటీ వాటాను కొనసాగించినంతవరకు వాటిపై ప్రభుత్వ రంగ సంస్థ ఆధిపత్యం ఉంటుంది. అయితే భవిష్యత్తులో మరిన్ని వాటాలను విక్రయించి ప్రభుత్వ వాటాను తగ్గిస్తే యాజమాన్య నిర్మాణంలో గణనీయమైన మార్పులు వచ్చే అవకాశం ఉంటుంది. అందువల్ల ప్రస్తుత పరిణామాలను పూర్తిస్థాయి ప్రైవేటీకరణగా కాకుండా, ప్రభుత్వ రంగ సంస్థల్లో మార్కెట్ ఆధారిత పెట్టుబడులు, వాటాల విక్రయాలు పెరుగుతున్న ప్రక్రియగా చూడాలి.

సింగరేణిపై కూడా ప్రభావం ఉంటుందా?

కోల్ ఇండియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలు తెలంగాణలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భవిష్యత్తుపై కూడా చర్చకు కారణమవుతున్నాయి. సింగరేణి సంస్థలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉండగా, కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ మెజారిటీ వాటాతో కొనసాగుతున్న ఈ సంస్థ తెలంగాణ పారిశ్రామిక, ఆర్థిక రంగంలో కీలక పాత్ర పోషిస్తోంది.కోల్ ఇండియా అనుబంధ సంస్థల లిస్టింగ్, వాటాల విక్రయం, ప్రైవేట్ బొగ్గు గనుల నిర్వహణకు ప్రోత్సాహం వంటి పరిణామాల నేపథ్యంలో సింగరేణి భవిష్యత్ విధానాలపై కూడా చర్చ జరుగుతోంది. భవిష్యత్తులో సింగరేణిలోనూ వాటాల విక్రయం లేదా అనుబంధ సంస్థల లిస్టింగ్ వంటి ప్రతిపాదనలు వస్తాయా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే ప్రస్తుతం సింగరేణి ప్రైవేటీకరణకు సంబంధించి అధికారిక నిర్ణయం ప్రకటించబడలేదు. సింగరేణి కార్మికులకు ఉద్యోగ భద్రత, వేతన ఒప్పందాలు, వైద్య సదుపాయాలు, పెన్షన్ ప్రయోజనాలు, సంస్థ ప్రభుత్వ రంగ స్వభావం కొనసాగింపు వంటి అంశాలు కీలకమైనవి. కోల్ ఇండియాలో జరుగుతున్న మార్పుల నేపథ్యంలో సింగరేణి భవిష్యత్తుపై కార్మిక వర్గంలో ఆసక్తి నెలకొంది.

కార్మికుల భవిష్యత్తుపై ఆందోళనలు

బొగ్గు పరిశ్రమలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబాల భవిష్యత్తుపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థల్లో అమలవుతున్న ఉద్యోగ భద్రత, వేతన ఒప్పందాలు, సామాజిక భద్రత, వైద్య సదుపాయాలు, పదవీ విరమణ ప్రయోజనాలు భవిష్యత్తులో ఎలా కొనసాగుతాయన్నది కీలకంగా మారింది.అనుబంధ సంస్థల లిస్టింగ్‌తో లాభదాయకత, ఉత్పాదకత, వ్యయ నియంత్రణకు అధిక ప్రాధాన్యత ఏర్పడవచ్చు. అయితే ఐపీఓల వల్ల ఉద్యోగుల హక్కులు తక్షణమే మారిపోతాయని చెప్పలేం. వాటి భవిష్యత్తు ప్రభుత్వ విధానాలు, యాజమాన్య నిర్ణయాలు, కార్మిక చట్టాలు, వేతన ఒప్పందాలపై ఆధారపడి ఉంటుంది.

ప్రభుత్వ రంగ బొగ్గు పరిశ్రమ భవిష్యత్తు ఏమిటి?

దేశ విద్యుత్ ఉత్పత్తి, ఉక్కు పరిశ్రమ, పారిశ్రామిక రంగాలకు బొగ్గు ఇప్పటికీ కీలక ఇంధన వనరుగా ఉంది. ఈ నేపథ్యంలో కోల్ ఇండియా, సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థల పాత్ర అత్యంత కీలకం. అయితే ప్రభుత్వ వాటాల విక్రయాలు, అనుబంధ సంస్థల లిస్టింగ్, ప్రైవేట్ బొగ్గు తవ్వకాల విస్తరణతో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య కొత్త పోటీ వాతావరణం ఏర్పడుతోంది.మొత్తానికి కోల్ ఇండియా పూర్తిస్థాయి ప్రైవేటీకరణ దిశగా వెళుతోందని ఇప్పుడే నిర్ధారించలేం. కానీ ప్రభుత్వ వాటాల తగ్గింపు, అనుబంధ సంస్థల ఐపీఓలు, ప్రైవేట్ బొగ్గు తవ్వకాల విస్తరణ భవిష్యత్తులో సంస్థ స్వరూపాన్ని మార్చే అవకాశాన్ని సూచిస్తున్నాయి. ఈ మార్పులు దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతవరకు ప్రయోజనం చేకూరుస్తాయి? ప్రభుత్వ రంగ సంస్థల ప్రయోజనాలు, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రతకు ఎంతవరకు రక్షణ కల్పిస్తాయి? అన్నది రాబోయే రోజుల్లో తేలాల్సి ఉంది.

మాజీ కో ఆప్షన్ సభ్యురాలు రజియా సుల్తానా మృతదేహానికి బాల్క సుమన్ నివాళులు

చెన్నూరు నియోజకవర్గం, నవంబర్ 20 (ప్రజాజ్యోతి): క్యాతనపల్లి మున్సిపాలిటీ మాజీ కో ఆప్షన్ సభ్యురాలు కే.శే. రజియా సుల్తానా మృతి పట్ల చెన్నూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాల్క సుమన్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె పార్థివ దేహాన్ని సంద ర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా రజియా సుల్తానా కుటుంబానికి ధైర్యం చెప్పారు.



గ్రామ పరిస్థితులపై ఎస్సై ఆరా

గ్రామ పెద్దలతో మాట్లాడి సమస్యలపై చర్చ



ఆసిఫాబాద్ , నవంబర్ 20 ప్రజా జ్యోతి కొమురంభీం ఆసిఫాబాద్ కాగజ్‌నగర్ మండలంలోని అంకుశాపూర్ గ్రామపంచాయతీని కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై జి. సంధ్యారాణి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పరిస్థితులను పరిశీలించి, గ్రామ పెద్దలతో సమావేశమయ్యారు. గ్రామ అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారితో చర్చించారు. గ్రామంలో శాంతియుత వాతావరణం కొనసాగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రజిత, గ్రామ పెద్దలు వినోద్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాఫీగా గ్రామ పరిపాలనకు పంచాయతీ భవనాలే కీలకం

ఎమ్మెల్యే పాయల్ శంకర్

రామాయ గ్రామం పంచాయ తీ భవనానికి భూమిపూజ



ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 20,(ప్రజా జ్యోతి) గ్రామాలలో పరిపాలన సజావుగా సాగడానికి పంచా యతీలకు సొంత భవనాలు కీలకమని అదిలాబాద్ ఎ మ్మెల్యే పాయల్ శంకర్ స్ప ష్టం చేశారు. రామాయి గ్రా మంలో గ్రామ పంచాయతీ, గ్రామ సమైక్య భవనాలకు భూమి పూజ చేశారు.సాత్నాల మండలంలోని రామాయి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం, గ్రామ సమైక్య భవన నిర్మాణ పనులకు నిర్వహించిన భూమి పూజ కార్యక్రమానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ గ్రామాల్లో పరిపాలన సజావుగా సాగాలంటే గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు ఉండటం ఎంతో అవసరమని అన్నారు. అనేక సంవత్సరాలుగా సొంత భవనాలు లేక గ్రామపంచాయ తీలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని తెలిపారు. గ్రామా ల్లో మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా కేంద్ర ప్రభు త్వం వందల కోట్ల రూపాయల నిధులను కేటాయి స్తోందని పేర్కొన్నారు.బీవీజి రాంజీ నిధులతో అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచా యతీ భవనాలు, గ్రామ సమైక్య భవనాలు, సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లు, ఆహార ధాన్యాల నిల్వ కేంద్రాల నిర్మాణం వంటి పనుల కోసం ప్రతి గ్రా మానికి రూ.30 లక్షలు కేటా యించడం జరిగిందన్నారు. ఈ నిధుల ద్వారా గ్రామాల్లో అభివృద్ధితో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని తెలిపారు.ఆదిలాబాద్ జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు పొలంబాట కార్యక్ర మం ద్వారా రైతుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్లి పలుమార్లు ప్రస్తావించడం జరిగిందన్నారు. మంజూరైన అభివృద్ధి పనులను అధికారులు త్వరితగతిన ప్రారంభించి, నిర్ణీత సమ యంలో పూర్తి చేయాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభు త్వం నిధుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్పటికీ, కేంద్ర ప్రభుత్వం కే టాయించిన నిధులతోనే గ్రా మాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మె ల్యే పాయల్ శంకర్ పేర్కొ న్నారు.

సిర్పూర్(టి) బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

త్వరగా టెండర్ ప్రక్రియ చేపట్టాలి

ఆర్టీసీ ఎండీ డాక్టర్ అనిల్ కుమార్‌కు వినతిపత్రం అందజేత

జాతీయ కాంగ్రెస్ మహిళా కార్యదర్శి బి. ఆదిత విజ్ఞప్తి





ALL INDIA MAHILA CONGRESS

B. ADITHA
National Secretary

To
Sri. Dr. Anil Kumar Garu, I.P.S
T.G.S.R.T.C - V.C & Managing Director
Government of Telangana

Subject: Request for Early Sanction and Initiation of the Tender Process for Construction of a Bus Stand at Sirpur (T), Kumuram Bheem Asifabad District - reg.

Respected Sir,

I would like to bring to your kind notice that Sirpur Assembly Constituency stands as Constituency No. 1 in Telangana State, and Sirpur (T) is an important transport point for people from many surrounding rural and interior villages.

However, Sirpur (T) still does not have a proper bus stand, causing inconvenience to students, women, senior citizens, workers, farmers and daily passengers who depend on public transport.

This has been a long-pending public requirement, and the people are hopeful that our Praja Palana Government will resolve it.

Therefore, I humbly request you to kindly accord priority to please initiate the tender process for the construction of a proper Bus Stand at Sirpur (T) at the earliest, for the convenience of the public and better rural connectivity.

Thanking you, Sir.

Yours sincerely,
Smt. B. ADITHA

ఆసిఫాబాద్, నవంబర్ 20 ప్రజా జ్యోతి సిర్పూర్(టి) బస్టాండ్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా కాంగ్రెస్ మహిళా కార్యదర్శి బి. ఆదిత తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ (ఐపీఎస్)ను కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన అనంతరం బస్టాండ్ నిర్మాణ అంశంపై వినతిపత్రం సమర్పించారు.తెలంగాణ రాష్ట్రంలోనే తొలి నియోజకవర్గ కేంద్రంగా గుర్తింపు పొందిన సిర్పూర్(టి)లో బస్టాండ్ నిర్మాణం లేక ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆదిత తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బస్టాండ్ నిర్మాణ టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై ఆర్టీసీ ఎండీ డాక్టర్ అనిల్ కుమార్ సానుకూలంగా స్పందించినట్లు ఆదిత వెల్లడించారు. సిర్పూర్(టి) బస్టాండ్ టెండర్ ప్రక్రియను వీలైనంత త్వరగా చేపట్టి, నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సంబంధిత శాఖ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.

తిర్యాణి అభివృద్ధికి రూ.84 లక్షలు

అభివృద్ధి పనులకు నీతి ఆయోగ్ ఎంపవర్డ్ కమిటీ ఆమోదం





ఆసిఫాబాద్, నవంబర్ 20 ప్రజా జ్యోతి జిల్లాలోని తిర్యాణి ఆకాంక్షిత బ్లాక్ అభివృద్ధికి రూ.84 లక్షల విలువైన పనులకు నీతి ఆయోగ్ ఎంపవర్డ్ కమిటీ ఆమోదం తెలిపిందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ వెల్లడించారు. శుక్రవారం నీతి ఆయోగ్ సీఈఓ అధ్యక్షతన నిర్వహించిన ఎంపవర్డ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు ఆమోదం లభించినట్లు పేర్కొన్నారు.తిర్యాణి బ్లాక్ పరిధిలోని గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యుత్, విద్య, వైద్యం, తాగునీరు, రహదారుల అనుసంధానంతో పాటు వివిధ రంగాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో ఆకాంక్షిత బ్లాక్ ఫెలో డాక్టర్ బాలరాజు రాజారాం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మూగజీవాల సేవకు యువత ముందుకు రావడం అభినందనీయం

మాజీ మంత్రి జోగు రామన్న



ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 20,(ప్రజా జ్యోతి) యువత సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ మూగజీవాలను ఆదరించి, వాటికి సేవలందించేందుకు ముందుకు రావడం అభినం దనీయ మని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు.శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జీవ జ్యోతి ఫౌండేషన్ సభ్యులు మాజీ మంత్రి జోగు రామన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఫౌండేషన్ సభ్యులు చేస్తున్న సేవలను జోగు రామన్న అభినందించారు. సమాజ సేవతో పాటు మూగజీవాల సంరక్షణకు యువత ముందుకు రావడం మంచి పరిణామమని పేర్కొన్నారు. జీవజ్యోతి ఫౌండేషన్ చేపట్టే సేవా కార్యక్రమాలకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అనిల్, కొండ గణేష్, దమ్మపాల్, బుట్టి శివ, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందాలి

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 20,(ప్రజా జ్యోతి) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆదిలాబాద్ ఎ మ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం లోని యాపాల గూడ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.రాష్ట్ర ముఖ్య మంత్రి రాష్ట్ర ప్రజల సంక్షే మం కోసం, దేశ ప్రధాని దేశ ప్రజల అభివృద్ధి కోసం ఆలో చించాల్సిన అవసరం ఉంద న్నారు. ప్రభుత్వం ప్రజలద ని, సంక్షేమ పథకాలు అర్హు లైన లబ్ధిదారులకు చేరేలా అందరూ బాధ్యతగా వ్యవ హరించాలని కోరారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురై నా పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పనిచేయాలన్నారు. యాపాల గూడ గ్రా మం ఐక్యతకు ప్రతీకగా ని లుస్తోందని, గ్రామ ప్రజలం తా ఐకమత్యంతో ఉండటం అభినందనీయమన్నారు. రాష్ట్రంతో పాటు దేశంలోని ప్రతి ఒక్కరికీ జీవిత బీమా ఉండాలని సూచించా రు.ఈ అంశంపై అసెంబ్లీలో పలుమార్లు ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. అర్హులైన వారు ఇందిరమ్మ కుటుంబ బీమా పథకానికి దరఖాస్తు చేసుకో వాలని ఎమ్మెల్యే సూచించారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా!

గోనలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం



ఆదిలాబాద్ టౌన్, న వంబరు 20 (ప్రజా జ్యోతి): పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించ డమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం భీంపూర్ మండలం లోని గోన గ్రామ పంచాయతీలో శుక్రవారం ప్రారంభమైంది. గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ మడవి కమలాబాయి, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకు లు పాల్గొని పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పథకం ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించనుందని తెలిపారు. కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించి నప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా ఈ పథకం ఎంతగానో ఉపయోగపడనుంది. సామాన్య, పేద కుటుంబాలకు భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం ఈ సంక్షేమ పథకాన్ని అమలు చేస్తోం దని పేర్కొన్నారు. గ్రామంలోని అర్హులైన కుటుంబాలన్నీ పథకానికి సంబంధించిన వివరాలను తెలుసుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రయోజనం పొందాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా ప్రజాప్రతినిధు లు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గోన సర్పంచ్ మడవి కమలాబాయి, ఉప సర్పంచ్ ముష్రన్ హైమద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు తన్వీర్ అహ్మద్, మాజీ కోఆప్షన్ సభ్యుడు జహుర్ హైమద్, సీనియర్ నాయకులు భీంరావు, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండలో నేడు ఉచిత వైద్య శిబిరం.. ప్రజలు వినియోగించుకోవాలి



నేరడిగొండ నవంబర్ 20 (ప్రజాజ్యోతి):నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రముఖ స్వప్న హాస్పిటల్ ఆధ్వర్యంలో నేరడిగొండ మండల కేంద్రంలోని ఐబీ గ్రౌండ్ లో శనివారం (21-11-2026) ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది.ఈ శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందించేందుకు ప్రముఖ వైద్య నిపుణులు హాజరుకాను న్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతు న్న వారు ఈ అవకాశాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని నిర్వాహకులు సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. మరిన్ని వివరాల కోసం ఇట్టి ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు. 888680666 /9104104108

అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా

సిరికొండలో ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభం..



సిరికొండ, నవంబరు 20 (ప్రజా జ్యోతి) అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ జీవిత బీమా పథకం సిరికొండ మండల కేంద్రంలో శుక్రవారం ప్రారంభమైంది. సిరికొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మండల ప్రత్యేక అధికారి మాట్లాడు తూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పిం చను న్నట్లు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంలో ఈ పథకం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. సిరికొండ, జాకీర్‌గూడ గ్రామాల పరిధిలోని అర్హులైన కుటుంబాలు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ అరవింద్, ఎంపీఓ, ఎంపీడీవో సంతోష్, సిరికొండ సర్పంచ్ బొడ్డు దత్తాత్రేయ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంచం లక్ష్మణ్, జిల్లా డీసీసీ కార్యదర్శి ఎస్.కె. ఇమామ్, మైనార్టీ చైర్మన్ రంజాన్, వార్డు సభ్యులు, ఆర్ఐ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కోట (కే) లో 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకం అమలు



సోనాల, నవంబర్ 20 (ప్రజాజ్యోతి): పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకం కోట (కే) లో సర్పంచ్ పూజ సంగ్రామ్ అధికారికంగా ప్రారంభించారు. స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామ కార్యదర్శి విజయ కుమార్ ఆధ్వర్యంలో శుక్ర వారం ఈ పథకం అమలు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూజ సంగ్రామ్ మాట్లాడుతూ... కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందు లు పడే బాధిత కుటుంబాలకు ఈ పథకం ఎంతో అండగా నిలు స్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఈ పథకం వర్తిం చేలా గ్రామ స్థాయిలో ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వం అంటే ఏ ఒక్కరిదో కాదు అందరిదీ

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్





ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 20,(ప్రజా జ్యోతి) ప్రభుత్వం అంటే ఏ ఒక్క రాజకీయ పార్టీకో సంబంధించినది కాదని, రాష్ట్రంలోనిప్రతి ఒక్కరికీ చెందుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు.జైనథ్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయ న లబ్ధిదారులకు 'చేయూత పెన్షన్' మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎ మ్మెల్యే మాట్లాడుతూ భర్త ను కోల్పోయిన వితంతువులు, దివ్యాంగులు, కిడ్నీ వ్యా ధిగ్రస్తులు, తలసేమియా బాధితులు ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక ఇబ్బందులు వర్ణనాతీతమని అన్నారు. ఆపదలో ఉన్న ఇలాంటి కు టుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందని, ఇదే విషయం పై తాను అసెంబ్లీలో నాలుగు సార్లు ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలి పారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నప్ప టికీ, ఇతర ఖర్చులు తగ్గించుకునైనా పేదలకు భరోసా కల్పించేలా పెన్షన్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరినట్లు ఆయన వివరించారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నే తృత్వంలోని ప్రభుత్వం అయినా, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అయినా ప్రజలందరికీ చెందినవేనని అన్నారు. తాను కేవలం తనకు ఓటు వేసిన వారికే కాకుండా, నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హా మీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్, స్థానిక ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు

నషా ముక్త్ భారత్ అభియాన్' ప్రచార రథాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా,



ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 20,(ప్రజా జ్యోతి) శుక్రవారం స్థానిక ఆదిలాబాద్ బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్ 'మిషన్ స్పందన్' అవగాహన కార్యక్రమంలో జిల్లా కలె క్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రచార రథాన్ని ప్రారంభించారు. వ్యసన రహిత సమాజ నిర్మాణం "నషా ముక్త్ తెలంగాణ" లక్ష్యంగా ప్రజల్లో విస్తృత చైతన్యం కల్పించేందుకు ఈ ప్రచారరథాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ మత్తు పదా ర్థాలు దురలవాట్లు యువత భవిష్యత్తును, కుటుంబ వ్య వస్థను నాశనం చేస్తాయని అందోళన వ్యక్తం చేశారు. వ్యసన రహిత సమాజని ర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రభుత్వ విభాగాలు సంయుక్తంగా చేపడుతున్న ఈ ప్రచార కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జ్యోతి, బీకే రేవతి, పుష్ప, గీత, అర్చన, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బీమా ప్రక్రియను వేగవంతం చేయాలి



జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 20,(ప్రజా జ్యోతి) ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు ప్రక్రియను సక్రమంగా, వేగవం తంగా నిర్వహించాలని జి ల్లా కలెక్టర్ రాజర్షి షా అధికా రులను ఆదేశించారు. శుక్ర వారం కలెక్టర్ క్యాంపు కా ర్యాలయం నుంచి వివిధ శా ఖల అధికారులతో ఆయన గూగుల్ మీట్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేసిన అనంతరం అక్నాలెడ్జ్‌మెంట్ రిజిస్టర్‌లో కచ్చితంగా బీమా పొందేవ్యక్తి సంతకమే తీసుకోవా లని స్పష్టం చేశారు. లబ్ధిదారుడికి బదులుగా ఇతరులు వచ్చి వివరాలు అందజేయడం, వారి స్థానంలో వేరొకరిని ప్రత్యామ్నాయంగా అనుమతించడం వంటివి చేయ కూడదని పేర్కొన్నారు. నమోదు పూర్తయిన తర్వాత సంబంధిత అక్నాలెడ్జ్‌మెంట్ రసీదును లబ్ధిదారులకు సక్రమంగా అందజేయాలని సూ చించారు. (శనివారం) నేటి నుంచి నమోదు పనులను మరింత వేగవంతం చేయా లని అధికారులను ఆదే శిం చారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రు, ఐటీడీఏ పీవో మంద మకరందు, ఉట్నూర్ సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమా ర్, జడ్పీ సీఈవో రవి, డీపీ వో రమేష్, డీఆర్‌డీవో రవీం దర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మెప్మా పీ డీ, పౌరసరఫరాల శాఖ అధి కారులు, ఈడీఎం, సీపీవో, మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పర్యవేక్షణాధి కారులుగా నియమితులైన మండల స్థాయి అధికారు లు, మున్సిపల్ వార్డు సూ పర్‌వైజర్లు తదితరులు పా ల్గొన్నారు.

గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి



అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు



నిర్మల్ జిల్లా ప్రతినిధి ,నవంబర్ 20 ,(ప్రజాజ్యోతి)రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు ఆదేశించారు.శుక్రవారం సాయంత్రం తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో గోదావరి పుష్కరాల నిర్వహణ ఏర్పాట్లపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని బాసరతో పాటు సోన్, ఖానాపూర్ తదితర పుష్కర ప్రాంతాల్లో భక్తులు సౌకర్యవంతంగా పుణ్యస్నానాలు ఆచరించేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. పుష్కరాల సందర్భంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, అవసరమైన మౌలిక వసతులకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన కార్యాచరణ ప్రణాళికను నిర్ణీత గడువులోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ తన పరిధిలో చేపట్టాల్సిన పనులను ముందుగానే గుర్తించి, వాటి అమలుకు అవసరమైన చర్యలు ప్రారంభించాలన్నారు.పుష్కర ప్రాంతాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తృతమైన పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా స్పష్టమైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పుష్కర ఘాట్ల వద్ద నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టడంతో పాటు తాగునీరు, ఇతర అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భక్తులకు మార్గదర్శనం చేసేందుకు వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు.పుష్కరాల నిర్వహణలో ప్రతి అంశాన్ని ముందుగానే పరిగణనలోకి తీసుకుని ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పుష్కరాల ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఉద్యానవన పంటల అధికారి రమణ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డీడబ్ల్యూఓ వినూత్న, డీటీడీఓ నిహారి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఈ ఎల్ సి పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటాలి




జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు.



నిర్మల్ జిల్లా ప్రతినిధి ,నవంబర్ 21 ,(ప్రజాజ్యోతి)రాష్ట్ర స్థాయి ఈ ఎల్ సి పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు.శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఈనెల 18వ తేదీన ఎస్ఐఆర్ కు సంబంధించి నిర్వహించిన జిల్లా స్థాయి ఈ ఎల్ సి (ఎలక్టోరల్ లిటరసీ క్లబ్) పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పోటీలలో గెలుపొందిన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఓడినవారు నిరాశ చెందకుండా పట్టుదలతో మళ్లీ ప్రయత్నిస్తూ ఉండాలన్నారు. అలాగే గెలిచినవారు కూడా రెట్టించిన ఉత్సాహంతో కృషిచేసి, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి, జిల్లా పేరు నిలబెట్టాలన్నారు. అనంతరం క్విజ్ పోటీలలో విజయం సాధించిన పదిమంది విద్యార్థులకు, వ్యాసరచన పోటీలలో విజయం సాధించిన పదిమంది విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వాతి, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బోర్డు పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలి



జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ప్రతినిధి ,నవంబర్ 20 ,(ప్రజాజ్యోతి)పదవతరగతి బోర్డు పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.నిర్మల్ పట్టణం సోమవార్ పేట్ లో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పదవతరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు పూర్తయిన సిలబస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తయిన పాఠాలన్నీ ఎప్పటికప్పుడు చదువుకొని ఇప్పటినుంచే సన్నద్ధం కావాలన్నారు. సబ్జెక్టుల్లో ఏవైనా సందేహాలు ఉంటే ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటూ ఉండాలన్నారు. బోర్డుపై విద్యార్థులచే గణితానికి సంబంధించి లెక్కలను చేయించారు లెక్కలు చేసిన విద్యార్థులను అభినందించి వారికి పెన్నులను బహుకరించారు. చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నతంగా నిలవాలని ఆకాంక్షించారు.అంతకుముందు పాఠశాల కార్యాలయం లో అన్ని రకాల రిజిస్టర్లను, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వివరాలు ఆన్ లైన్‌లో పరిశీలించారు. పాఠశాలలో క్రమం తప్పకుండా పూర్తిస్థాయి హాజరు ఉండాలన్నారు. ఆధార్ కార్డు లేని విద్యార్థులను గుర్తించి, కార్డులు ఇప్పించేలా, అవసరమైన వారి వివరాలు అప్డేట్ చేసేలా చొరవ చూపాలన్నారు. యూడైస్ వివరాలు పరిశీలించారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఎంఈవో పద్మ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం శిబిరాల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లకు తావు ఉండకూడదు

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

చిట్యాల గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా శిబిరాన్ని తనిఖీ చేసిన కలెక్టర్







నిర్మల్ జిల్లా ప్రతినిధి ,నవంబర్ 20 ,(ప్రజాజ్యోతి)ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం శిబిరాల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లకు ఆస్కారం ఉండకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్మల్ గ్రామీణ మండలం చిట్యాల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు శిబిరాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన బీమా నమోదు తీరును పరిశీలించారు. బీమా నమోదు ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బీమా చేయు వ్యక్తి పేరు, నామినీ వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని అన్నారు. వివరాల నమోదులో ఎలాంటి తప్పులు చేయకూడదన్నారు. ప్రక్రియ పూర్తి చేసిన వారి వివరాలు రిజిస్టర్ లో స్పష్టంగా పొందుపరిచాలని చెప్పారు. బీమా నమోదు ప్రక్రియలో ఏవైనా సాంకేతికపరమైన ఇబ్బందులు కలిగితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. శిబిరాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.ఈ తనిఖీలో తహసీల్దార్ ప్రభాకర్, ఎంపిడిఓ సుధాకర్, సర్పంచ్ సుప్రియ వెంకట్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

యాపల్‌గూడలో గ్రంథాల యం, గ్రామ సమాఖ్య (వీ ఓ), ఏసీ సామాజిక భవనా లను ప్రారంభించిన కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే పాయ ల్ శంకర్





ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 20,(ప్రజా జ్యోతి) గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి తో పాటు ప్రజలకు అవసర మైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధా న్యతనిస్తోందని జిల్లా కలెక్ట ర్ రాజర్షిషా అన్నారు. గ్రా మాల్లో నిర్మిస్తున్న అభివృద్ధి పనులు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడేలా ఉండాల ని పేర్కొన్నారు.శుక్రవారం ఆదిలాబాద్ గ్రామీణ మం డలంలోని యాపల్‌గూడ గ్రా మంలో నూతనంగా నిర్మించి న గ్రంథాలయం, గ్రామ స మాఖ్య (వీఓ) భవనం, ఏసీ సామాజిక భవనాలను స్థా నిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రా రంభించారు. అనంతరం భవనాలను పరిశీలించి వాటి వినియో గం గురించి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ, మహిళా సంఘాల సభ్యులు నూతనంగా నిర్మించి న గ్రామ సమాఖ్య భవనాన్ని సద్వినియోగం చేసుకొని సంఘాల కార్యకలాపాలను మరింత విస్తరించుకోవాలని సూచించారు. మహిళలు ఆ ర్థికంగా స్వావలంబన సా ధించే దిశగా సమష్టిగా కృషి చేయాలన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంథాల యం విద్యార్థులు, నిరుద్యో గ యువతకు ఎంతో ఉప యోగకరంగా ఉంటుందని, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు గ్రంథాలయం లోని పుస్తకాలను సద్విని యోగం చేసుకొని ఉన్నత ల క్ష్యాలను సాధించాలని ఆ కాంక్షించారు. సామాజిక భ వనం గ్రామ ప్రజలకు శుభ కార్యాలు, ఇతర సామూహి క కార్యక్రమాల నిర్వహణకు ఎంతగానో దోహదపడుతుం దని తెలిపారు.ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడు తూ, యాపల్‌గూడ గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్షలైన గ్రంథాలయం, గ్రామ సమా ఖ్య భవనం, ఏసీ సామాజిక భవనం అందుబాటులోకి రావడం సంతోషకరమన్నా రు. నియోజకవర్గంలోని ప్ర తి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రా మాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపా రు. ప్రజల అవసరాలను గు ర్తించి రానున్న రోజుల్లో మరి న్ని అభివృద్ధి పనులు చేప డతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రమేశ్, ఎంపీడీఓ వంశీకృష్ణ, స్థానిక సర్పంచి నిరోష, పం చాయతీ కార్యదర్శి నజీ మా, ప్రజాప్రతినిధులు, గ్రా మస్థులు తదితరులు పాల్గొ న్నారు.

మంచిర్యాలలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సమావేశం

ఆర్టీఐ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు

మంచిర్యాల, 20,నవంబర్ (ప్రజాజ్యోతి) సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) -- 2005పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు సూచించారు. మంచిర్యాల జిల్లా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ అధ్యక్షులు పెద్దల చంద్రకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.కమిటీ జాతీయ అధ్యక్షులు జంగంటి శ్రీనివాస్ ముదిరాజ్ ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎలిగేండ్ల వెంకటేష్ సూచనతో ఏటి ఆంజనేయులు మంచిర్యాల జిల్లాకు విచ్చేసి ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా అధ్యక్షులు పెద్దల చంద్రకాంత్, కమిటీ సభ్యులు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం ఆర్టీఐ చట్టం ప్రాధాన్యతను వివరిస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే పరిపాలనా వ్యవహారాలు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజాధనం వినియోగం తదితర అంశాలపై సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు సమాచారాన్ని ఎలా పొందవచ్చో వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు ఈ చట్టం కీలకమైన ఆయుధమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చట్టంపై అవగాహన పెంచుకొని ప్రజా ప్రయోజనాల కోసం చట్టబద్ధంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా



సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీని గ్రామస్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు బలోపేతం చేయాలని, ప్రజలకు చట్టంపై విస్తృత అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మంచిర్యాల జిల్లాలో ఆర్టీఐ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని కమిటీ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు భీమా శేఖర్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సాయికిరణ్, జిల్లా యువజన నాయకులు బూతగడ్డ రాజేష్, మంచిర్యాల అసెంబ్లీ అధ్యక్షులు రాజకుమార్, మంచిర్యాల మండల యువజన నాయకులు రాజుకుమార్, జైపూర్ మండల అధ్యక్షులు అమరగొండ శివకుమార్, కోటపల్లి అధ్యక్షులు సత్తిష్, సోషల్ మీడియా ఇన్‌చార్జి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ అభ్యర్థులకు గ్రూప్- గ్రూప్ ఉచిత ఫౌండేషన్ కోచింగ్

100 చొప్పున అభ్యర్థులకు అవకాశం..

నవంబర్ 26లోగా దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి రాజేశ్వరి

మంచిర్యాల, 20, నవంబర్ (ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా టీజీపీఎస్సీ గ్రూప్-గ్రూప్-పరీక్షలకు సిద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు ఉచిత ప్రాథమిక ఫౌండేషన్ కోచింగ్ అందించనున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి రాజేశ్వరి తెలిపారు. ఇందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు .తెలంగాణ రాష్ట్రానికి చెందిన ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, పార్సీలు, బౌద్ధ మైనారిటీ వర్గాలకు చెందిన అభ్యర్థులు ఈ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలని అర్హత ప్రమాణంగా నిర్ణయించినట్లు వివరించారు .గ్రూప్ కోచింగ్‌కు 100 మంది, గ్రూప్- కోచింగ్‌కు మరో 100 మంది చొప్పున మొత్తం 200 మందికి శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ నవంబర్ 17న ప్రారంభమైందని, నవంబర్ 26 చివరి తేదీగా నిర్ణయించామని, నవంబర్ 27 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు .దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు, డిజిటల్ స్కానింగ్ నిమిత్తం ఒరిజినల్ ఆధార్ కార్డు, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో హాజరుకావాలని సూచించారు. రిజిస్ట్రేషన్, ఇతర వివరాల కోసం తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్, ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ప్రాంగణం, ఎంఏఎం క్యాంపస్, ఇంటర్మీడియట్ బోర్డు వెనుక, శ్రీ బాలాజీ ఎన్‌క్లేవ్, గోషామహల్, నాంపల్లి, హైదరాబాద్-500001 చిరునామాలో సంప్రదించాలని కోరారు. పని దినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం5 గంటల వరకు 040-23236112, 9059050062 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. అలాగే ఈ-మెయిల్ ద్వారా కూడా వివరాలు పొందవచ్చని తెలిపారు .మైనారిటీ వర్గాలకు చెందిన డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన అభ్యర్థులు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ఉచిత కోచింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి రాజేశ్వరి కోరారు.

గ్రూప్ ఉచిత ఫౌండేషన్ కోచింగ్

100 చొప్పున అభ్యర్థులకు అవకాశం.

నవంబర్ 26లోగా దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి రాజేశ్వరి

మంచిర్యాల, 20, నవంబర్ (ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా టీజీపీఎస్సీ గ్రూప్- గ్రూప్- పరీక్షలకు సిద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు ఉచిత ప్రాథమిక ఫౌండేషన్ కోచింగ్ అందించనున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి రాజేశ్వరి తెలిపారు. ఇందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు .తెలంగాణ రాష్ట్రానికి చెందిన ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, పార్సీలు, బౌద్ధ మైనారిటీ వర్గాలకు చెందిన అభ్యర్థులు ఈ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలని అర్హత ప్రమాణంగా నిర్ణయించినట్లు వివరించారు .గ్రూప్ కోచింగ్‌కు 100 మంది, గ్రూప్

బ్యాంక్ ఆఫ్ అమెరికాకు

హైదరాబాద్‌లో 8.28 కోట్ల అద్దె

హైదనాబాద్ : హైదరాబాద్ మహానగరం మరోసారి తన సత్తా చాటింది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు గమ్యస్థానంగా మారింది. ప్రపంచ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ అమెరికా తమ భారత అనుబంధ సంస్థ బీఏ కంటిన్యూమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా హైదరాబాద్ మాదాపూర్‌లోని మైండ్ స్పేస్ సైబరాబాద్లో ఏకంగా 10,10,467 చదరపు అడుగులు 1 మిలియన్ స్క్వేర్ ఫీట్ కంటే ఎక్కువ) ఆఫీసు స్థలాన్ని లీజుకు తీసుకుంది. కె.రహేజా ఐటీ పార్క్ (మైండ్ స్పేస్ బిజినెస్ పార్క్)ని ఖీఇమి)కు చెందిన బిల్డింగ్ నంబర్-1 గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు 11 అంతస్తులు అంటే మొత్తం 12 ఫ్లోర్లను 12 సంవత్సరాల కాలానికి లీజుకు తీసుకుంది. ఈ ఒప్పందం విలువ అద్దె రూపంలోనే సుమారు రూ.1450 కోట్ల నుంచి రూ.1500 కోట్ల వరకు ఉంటుందని ప్రాప్ స్టాక్ వెల్లడించింది. ఈ ఏడాది దేశంలో నమోదైన అతిపెద్ద ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాల్లో ఒకటిగా నిలిచిన ఈ మెగా డీల్ పూర్తి వివరాలు తెలుసుకుందాం.రియల్ ఎస్టేట్ డేటా అనలిటిక్స్ సంస్థ ప్రాప్ స్టాక్ సెకరించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల ప్రకారం మాదాపూర్ మైండ్ స్పేస్ సైబరాబాద్ బిల్డింగ్ నంబర్ 1లోని గ్రౌండ్ ప్లస్ 11 అంతస్తులలో మొత్తం 10,10,467 చదరపు అడుగుల ఛార్జబుల్ ఏరియా లీజుకు తీసుకున్నారు.ప్రతి చదరపు అడుగుకు నెలకు రూ.82 చొప్పున, ప్రారంభ నెలవారీ అద్దె రూ.8.28 కోట్లుగా, ఏడాదికి రూ.99.42 కోట్లుగా నిర్ణయించారు. ఈ లీజు కోసం బ్యాంక్ ఆఫ్ అమెరికా ఇప్పటికే రూ.49.72 కోట్లను సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించింది. ఒప్పందం ప్రకారం ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి 15 శాతం చొప్పున అద్దె పెంచనున్నారు.